విలేకరులు కావలెను
తెలంగాణ వాణి
తెలంగాణ వ్యాప్తంగా అన్ని జిల్లాలు, నియోజకవర్గాలు, మండలాల వారిగా విలేకర్లు కావలెను.
పొలిటికల్, ప్రజాసమస్యలు, అక్రమాలపై వార్త రాసే పట్టు కలిగిన వారికి మొదటి ప్రాధాన్యత ఇవ్వబడును
9703247143

TELANGANA VANI TELUGU DAILY
R N I No. APTEL/2012/53127
# తెలంగాణ వాణి
తెలుగు దినపత్రిక
తెలంగాణ వాణి TV
THE VOICE OF TELANGANA
ఎడిటర్ జేరిపోతుల సంపత్
9912758107

సంపుటి: 16 | సంచిక : 136 | బుధవారం16. 9. 2026 | ఎడిటర్: జేరిపోతుల సంపత్ | కరీంనగర్ | పేజీలు 8 | వెల: 5.00

## మోదీ నిబద్ధతకు అద్దంగా బ్రిక్స్



15 మంది దేశాధి నేతలతో భేటీలు!

ఢిల్లీలో ముగిసిన 18వ బ్రిక్స్ సదస్సు

సదస్సుతో పాటు 15 ద్వైపాక్షిక భేటీల్లో మోదీ

రష్యా, చైనా అధ్యక్షులతో పాటు పలువురు ప్రపంచ నేతలతో చర్చలు

ఢిల్లీ (తెలంగాణ వాణి) ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దౌత్యపరంగా తనదైన శైలిని, అలుపెరగని శక్తిని మరోసారి ప్రదర్శించారు. ఢిల్లీలోని మిగతా 2లో..

## న్యాయవ్యవస్థపై విమర్శలు

న్యాయ వ్యవస్థ అనేది విమర్శలకు, పరిశీలనకు అతీతమైనదేమీ కాదని రాజ్యాంగ ప్రజాస్వామ్యంలో న్యాయస్థానాల పనితీరుపై వచ్చే సరైన విమర్శలు, సూచనలు జవాబుదారీతనాన్ని పెంచడానికి ఎంతో అవసరమని భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్య కాంత్ స్పష్టం చేశారు. న్యాయవ్యవస్థపై విమర్శలు అవసరమేనని, న్యాయవ్యవస్థను ప్రశ్నించొచ్చు.. విమర్శించొచ్చన్నారు. ప్రజా విశ్వాసమే న్యాయ వ్యవస్థకు అసలైన బలమని ఆయన పేర్కొన్నారు. నిన్న ఢిల్లీలో జరిగిన రామ్ జెఠ్మలానీ 6వ సంస్మరణ ఉపన్యాస కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. న్యాయ వ్యవస్థ పరిశీలనకు అతీతంగా ఉండలేదని వ్యవస్థ పనితీరుపై వచ్చే నిర్మాణాత్మక, ఆధారసహిత విమర్శలు ప్రజాస్వామ్యానికి మేలు చేస్తాయన్నారు. ఇవి సంస్థాగత జవాబుదారీతనానికి, తప్పులను దిద్దుకోవడానికి దోహదపడతాయని వ్యాఖ్యానించారు.

## తెలుగు రాష్ట్రాలకు 5 లక్షల ఇళ్ల కేటాయింపు



- కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్
- ఆంధ్రప్రదేశ్‌కు 3 లక్షలు, తెలంగాణకు 2 లక్షల ఇళ్లు కేటాయింపు
- “2019-24 మధ్య కాలంలో ఏపీకి 1.78 లక్షల ఇళ్లు కేటాయించగా.
- . దానిలో కేవలం 42వేల ఇళ్లు మాత్రమే పూర్తయ్యాయి.
- 2019-24 మధ్య గ్రామీణ ఆవాస యోజన పథకంలో తెలంగాణ చేరలేదు.
- తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎం రేవంత్‌రెడ్డి
- రెండుమూడు సార్లు ఇళ్ల కేటాయింపు కోసం విజ్ఞప్తి చేశారు.



## యూపీఐ చెల్లింపులకు ఛార్జీలు.. ట్రంప్‌ను బుజ్జగించేందుకేనా?

రూ.2000 వరకు ఉండే యూపీఐ లావాదేవీలపై బ్యాంకులు/పేమెంట్ సర్వీసు ప్రొవైడర్లు ఛార్జీలు వసూలు చేయరాదని కేంద్రం ఇచ్చిన నోటిఫికేషన్‌పై కాంగ్రెస్ స్పందించింది. యూపీఐ చెల్లింపులకు ఛార్జీలు.. ట్రంప్‌ను బుజ్జగించేందుకేనా..? కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభలో ప్రతిపక్ష నేత, ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ ప్రశ్నించారు. రూ.2వేలు దాటిన యూపీఐ లావాదేవీలపై ఫీజులు విధించడానికి కేంద్రం నిశ్శబ్దంగా మార్గం సుగమం చేసిందంటూ విమర్శించారు.

## రియల్ లైఫ్ థ్రిల్లర్ నీడను కూడా వదల్లేదు

### బొల్లారం వెపన్స్ చోరీ కేసులో 'సినిమా స్టైల్' ఇన్వెస్టిగేషన్



హైదరాబాద్ తెలంగాణ వాణి) దేశ వ్యాప్తంగా సంచలనం రేపిన బొల్లారం మిలటరీ మద్రాసు రెజిమెంట్ వెపన్స్ చోరీ కేసులో హైదరాబాద్ టాస్క్ ఫోర్స్ పోలీసులతో పాటు మిలటరీ అధికారులు, రాష్ట్రంలోని వివిధ పోలీసు విభాగాలు, కేంద్ర దర్యాప్తు ఏజెన్సీలు జరిపిన ఇన్వెస్టిగేషన్ ఇప్పుడు అత్యంత ఆసక్తిని రేపుతోంది. ఈ మిస్టరీ ఛేధన వెనకాల సాగిన పోలీసుల కష్టం, దర్యాప్తు సంస్థల ఉన్నతాధికారుల మిగతా 2లో..

# మూసీ నది పునరుజ్జీవం కోసం ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం

- తాజ్ ఫలక్‌నుమా ప్యాలెస్‌లో ప్రిన్స్ రహీమ్ అగాఖాన్-తో సీఎం రేవంత్‌రెడ్డి భేటీ
- గ్లోబల్ సమిట్‌కు హాజరుకావాలని ఆయన్ను సీఎం ఆహ్వానం
- “వారసత్వ సంపదను పునరుద్ధరించడంలో అగాఖాన్ ఫౌండేషన్‌ది అత్యంత కీలకపాత్ర.
- ఫౌండేషన్ సాయంతో మండలి భవనం, కుతుబ్ షాహీ టూంబ్స్‌ను పునరుద్ధరించుకున్నాం.
- మూసీ నది పునరుజ్జీవం కోసం ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం.
- సిటీ కాలేజ్, ఉస్మానియా ఆస్పత్రి భవనాల పునరుద్ధరణకు సాయం కోరుతున్నాం.
- డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో ఫ్యూచర్ సిటీలో గ్లోబల్ సమిట్ నిర్వహిస్తున్నాం.
- 100కు పైగా దేశాల నుంచి ప్రతినిధులు హాజరవుతారు”
- తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి





వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి జూబ్లీహిల్స్ లోని నివాసంలో కుటుంబ సమేతంగా గణపతి పూజ నిర్వహించారు. రాష్ట్ర ప్రజలందరికీ వినాయక చవితి శుభాకాంక్షలు తెలియజేశారు. విఘ్నేశ్వరుని దివ్య ఆశీస్సులతో ప్రజల జీవితాల్లోని విఘ్నాలన్నీ తొలగిపోయి, ప్రతి కుటుంబానికి ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని ప్రార్థించారు.

హైదరాబాద్ తెలంగాణ వాణి)
తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల్లో ఆగా ఖాన్ ఫౌండేషన్ ద్వారా మరింత సహకారం అందించాలని ముఖ్యమంత్రి శ. రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. తెలంగాణలోని విద్యా, పర్యాటక, వైద్య రంగాల్లో కలిసి పని చేద్దామని కోరారు. భారత పర్యటనలో ఉన్న ఆగా ఖాన్ ఫౌండేషన్ చైర్మన్ హిజ్ హైనెస్ ప్రిన్స్ రహీమ్ ఆగా ఖాన్-ఎ గారు హైదరాబాద్ వచ్చిన సందర్భంగా ముఖ్యమంత్రి వారితో మర్యాదపూర్వకంగా సమావేశమయ్యారు. తాజ్ ఫలక్‌నుమా ప్యాలెస్‌లో జరిగిన ఈ సమావేశంలో ఆగా ఖాన్ ఫౌండేషన్ ద్వారా తెలంగాణలో చేపట్టిన అభివృద్ధి పనులను ముఖ్యమంత్రి గుర్తుచేశారు. ఆగా ఖాన్ ఫౌండేషన్‌పై అత్యంత గౌరవం ఉందని పేర్కొంటూ, హైదరాబాద్‌తో ఆగా ఖాన్ కుటుంబానికి ఉన్న అనుబంధాన్ని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు తెలంగాణ వారసత్వ సంపదను పునరుద్ధరించడంలో ఫౌండేషన్ అత్యంత కీలక పాత్ర పోషిస్తోందని అన్నారు. ఫౌండేషన్ సహకారంతో ఇటీవల శాసనమండలి భవనాన్ని పునరుద్ధరించడం, అలాగే నగరంలోని కుతుబ్ షాహీ టూంబ్స్‌ను పునరుద్ధరించిన విషయాన్ని ముఖ్యమంత్రి గుర్తుచేశారు. హైదరాబాద్ నగర పునర్నిర్మాణంలో భాగంగా మూసీ నది పునరుజ్జీవన ప్రాజెక్టుపై సిద్ధం చేసిన ప్రణాళికలను ముఖ్యమంత్రి గారు వివరించారు. మూసీ నది వెంట నైట్ ఎకానమీ కార్యకలాపాల దిశగా తీర్చిదిద్దుతున్న విషయాలను తెలిపారు. మూసీ పరివాహక ప్రాంతంలో ఉన్న చారిత్రక సిటీ కాలేజ్, ఉస్మానియా ఆసుపత్రి భవనాల పునరుద్ధరణలో సహకరించాలని కోరారు. ఉస్మానియా ఆసుపత్రి కోసం గోషామహల్‌లో నూతన భవనాన్ని నిర్మిస్తున్నామని, ప్రస్తుత ఉస్మానియా ఆసుపత్రి భవనాన్ని వారసత్వ సంపదగా తీర్చిదిద్దాలని భావిస్తున్నట్టు వివరించారు.

## లోతుకుంట భూములపై వాస్తవాలు తెలుస్తాయి



మహానగరంలో సంచలనం సృష్టించిన లోతుకుంట భూవివాదంపై సుప్రీంకోర్టు కీలక తీర్పు వెలువడించిందని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ వెల్లడించారు. కాలపరిమితి ముగియడంతో ఈ భూవివాదానికి సంబంధించిన పిటిషన్‌ను సర్వోన్నత న్యాయస్థానం కొట్టివేసిందని ఆయన స్పష్టం చేశారు.సాధారణంగా కోర్టు తీర్పులపై అప్పీల్ దాఖలు చేయడానికి 90 రోజుల చట్టపరమైన గడువు ఉంటుందని కమిషనర్ రంగనాథ్ అన్నారు లోతుకుంట భూవివాదానికి సంబంధించిన కేసులో అప్పీల్ దాఖలు చేయడానికి ఏకంగా 219 రోజులు పట్టిందని, నిర్ణీత కాలపరిమితి ముగియడం వల్లే సుప్రీంకోర్టు పిటిషన్‌ను తోసిపుచ్చింద




## జెన్ జీ, జెన్ ఆల్ఫా చెప్పేది వినేందుకు మేం సిద్ధమే

- కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్
- యువత ఆశయాలను వినడానికి దేశం సిద్ధంగా ఉంది
- దేశం మనకు ఏం చేసిందని ప్రశ్నించకుండా.. మనం దేశం కోసం ఏం చేశామని ప్రశ్నించుకోవాలి
- మిమ్మల్ని మీరు జెన్‌జీ, జెన్ ఆల్ఫా అని పిలుచుకున్నా సరే..
- మీరు చెప్పేది వినడానికి మేమంతా సిద్ధంగా ఉన్నాం.
- కానీ మీ చుట్టూ ఏం జరుగుతోంది? అందులో మీ పాత్ర ఏమిటి?,
- మీరు దేశం కోసం ఏం సాధించవచ్చు? అనే విషయాల గురించి తప్పక ఆలోచించాలి.

# కొత్తగూడెం అసెంబ్లీ బరిలో వనమా వారసురాలు?

- నాలుగు సార్లు ఎమ్మెల్యే.. మాజీ మంత్రి.. ప్రజల మనిషిగా ప్రత్యేక ముద్ర
- వనమా వెంకటేశ్వరరావు తర్వాత కొత్తగూడెం రాజకీయాల్లో అలేఖ్య పేరుపై ఆసక్తికర చర్చ
- తాత అడుగుజాడల్లో మనవరాలు.. త్వరలోనే రాజకీయ అరంగేట్రానికి రంగం సిద్ధమవుతోందా?



భద్రాద్రి బ్యూరో, సెప్టెంబర్ 15 (తెలంగాణ వాణి)
కొత్తగూడెం రాజకీయాలు.. వనమా కుటుంబం.. ఈ రెండింటినీ విడదీసి చూడటం అంత సులభం కాదు. ప్రజల సుఖసంతోషాల్లోనే కాదు.. వారి కష్టనష్టాల్లోనూ ప్రజల మధ్య నిలిచే నాయకుడిగా మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు నియోజకవర్గ రాజకీయాల్లో తనదైన ముద్ర వేశారు. వార్డు సభ్యుడిగా ప్రారంభమైన ఆయన రాజకీయ ప్రస్థానం నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలిచే స్థాయికి, మంత్రి పదవిని చేపట్టే స్థాయికి ఎదిగింది. ఎన్ని పదవులు చేపట్టినా.. ఎలాంటి డాబు, దర్పం లేకుండా సామాన్యులకు అందుబాటులో ఉండే ప్రజాప్రతినిధిగా వనమా వెంకటేశ్వరరావుకు ప్రత్యేక గుర్తింపు ఉందని ఆయన అనుచరులు చెబుతుంటారు. దశాబ్దాలుగా కొత్తగూడెం రాజకీయాల్లో క్రియాశీలకంగా ఉంటూ వచ్చిన వనమా.. నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణ రాజకీయాల వరకు తనకంటూ ప్రత్యేక రాజకీయ బలం, అనుచర వర్గాన్ని ఏర్పాటు చేసుకున్నారు.

### వనమా రాజకీయాలకు విరామమా?

ప్రస్తుతం కొత్తగూడెం నియోజకవర్గంలో మారుతున్న రాజకీయ పరిణామాలు ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో వనమా వెంకటేశ్వరరావు ప్రత్యక్షంగా పోటీకి దూరంగా ఉండవచ్చనే ప్రచారం రాజకీయ వర్గాల్లో జోరుగా సాగుతోంది. అయితే దీనిపై స్పష్టమైన సమాచారం లేదు. అయినప్పటికీ ఆయన భవిష్యత్ రాజకీయ నిర్ణయం ఏమిటన్నది బీఆర్ఎస్‌తో పాటు ఇతర పార్టీల్లోనూ చర్చనీయాంశంగా మారింది.

### వనమా లేని కొత్తగూడెం?

వనమా వెంకటేశ్వరరావు లేకుండా కొత్తగూడెం నియో జకవర్గ రాజకీయా లను ఊహిం చడం కష్టమేనన్నే అభిప్రాయం ఆయన అభిమానులు, అను చరుల్లో బలంగా వినిపిస్తోంది. ముఖ్యంగా బీఆర్ఎస్‌లో వనమా కుటుంబానికి ఉన్న రాజకీయ ప్రాధాన్యత నేపథ్యంలో.. రాబోయే ఎన్నికల్లో వనమా కుటుంబం నుంచి ఎవరు రంగంలోకి దిగుతారన్నది కీలక ప్రశ్నగా మారింది.

వనమా కుటుంబం రాజకీయంగా దూరంగా ఉంటే.. బీఆర్ఎస్ తరపున ఎవరు బరిలో నిలిచినా గెలుపు అంత సులభం కాదనే వాదనలు కూడా రాజకీయ వర్గాల్లో వినిపిస్తున్నాయి. మరోవైపు ఎన్నికల సమయానికి మారే రాజకీయ సమీకరణాలు, అభ్యర్థుల ఎంపిక, పార్టీ బలం, స్థానిక అంశాలు ఫలితాలను ప్రభావితం చేస్తాయని పరిశీలకులు అంటున్నారు.

### వారసురాలిగా అలేఖ్య పేరు

ఇదే సమయంలో వనమా కుటుంబం నుంచి మరో పేరు రాజకీయ వర్గాల్లో చర్చకు వస్తోంది. వనమా వెంకటేశ్వరరావు కుమారుడు వనమా రాఘవేంద్రరావు కుమార్తె వనమా అలేఖ్య రాజకీయ అరంగేట్రంపై పార్టీ శ్రేణుల్లో ఆసక్తి పెరుగుతున్నట్లు సమాచారం. చిన్ననాటి నుంచే తాతయ్య వనమా వెంకటేశ్వరరావు రాజకీయ ప్రస్థానాన్ని దగ్గరగా చూస్తూ పెరిగిన అలేఖ్యకు నియోజకవర్గ రాజకీయాలపై పూర్తి అవగాహన ఉందని పలువురు చెబుతున్నారు. గత రెండు అసెంబ్లీ ఎన్నికల సమయంలో వనమా వెంకటేశ్వరరావు విజయం కోసం ఆమె చేసిన కృషి అందరికి తెలిసిందే. నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాలు, స్థానిక రాజకీయ పరిణామాలు, వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తల వ్యవహారశైలిపై అలేఖ్యకు స్పష్టమైన అవగాహన ఉందనే చర్చ కూడా కొనసాగుతోంది.



### “తాత రాజకీయ వారసత్వంతో బరిలోకి అలేఖ్య ?

వనమా వెంకటేశ్వరరావు తర్వాత ఆయన రాజకీయ వారసత్వాన్ని ఎవరు కొనసాగిస్తారన్న ప్రశ్నకు అలేఖ్య పేరు తెరపైకి రావడం ఇప్పుడు ఆసక్తిని పెంచుతోంది. తాతయ్య రాజకీయ ప్రస్థానాన్ని దగ్గరగా చూస్తూ పెరిగిన అలేఖ్య.. అదే బాటలో రాజకీయాల్లోకి అడుగుపెడతారా? లేక ముందుగా పార్టీ కార్యక్రమాలు, ప్రజా సమస్యలపై తనదైన ముద్ర వేసుకుంటారా? అన్నది ఆసక్తికరంగా మారింది. అలేఖ్య రాజకీయ ప్రవేశం విషయంలో కుటుంబ సభ్యులు, అభిమానులు, అనుచర వర్గాల్లో చర్చ జరుగుతున్నట్లు సమాచారం. అయితే ఆమె ఎప్పుడు రాజకీయ రంగప్రవేశం చేస్తారన్న అంశంపై స్పష్టత రావాల్సి ఉంది.

### కొత్తగూడెం రాజకీయాల్లో కొత్త అధ్యాయం?

కొత్తగూడెం రాజకీయాల్లో వనమా కుటుంబం మూడు తరాలుగా ప్రజా జీవితంతో ముడిపడి ఉందనే చర్చ ఉంది. ఈ నేపథ్యంలో వనమా వెంకటేశ్వరరావు రాజకీయ ప్రస్థానానికి తర్వాతి అధ్యాయం ఎలా ఉండబోతోందన్నది ప్రాధాన్యత సంతరించుకుంది. తాతకు మనవరాలిగా మాత్రమే కాకుండా.. తనకంటూ ప్రత్యేక రాజకీయ గుర్తింపు తెచ్చుకోవాలనే లక్ష్యంతో అలేఖ్య రంగంలోకి దిగితే కొత్తగూడెం రాజకీయాల్లో కొత్త సమీకరణాలకు తెరలేచే అవకాశం ఉందని రాజకీయ వర్గాలు అంచనా వేస్తున్నాయి. తాత రాజకీయ వారసత్వం.. వనమా కుటుంబానికి నియోజకవర్గంలో ఉన్న పట్టు.. యువతరం ఆశలు.. వీటన్నింటి మధ్య వనమా అలేఖ్య రాజకీయ అరంగేట్రానికి ఎప్పుడు తొలి అడుగు వేస్తారు? కొత్తగూడెం రాజకీయాల్లో వనమా కుటుంబానికి ఇది కొత్త అధ్యాయానికి నాంది అవుతుందా?
ప్రస్తుతం ఈ ప్రశ్నలే నియోజకవర్గ రాజకీయ వర్గాల్లో హాట్‌టాపిక్‌గా మారాయి.

# విఘ్నాలు తొలగాలి.. అభివృద్ధి వెల్లివిరియాలి!

### కలెక్టర్ కార్యాలయంలో ఘనంగా వినాయక పూజలు



**కరీంనగర్, సెప్టెంబర్ 14 (తెలంగాణ వాణి)**
వినాయక చవితి సందర్భంగా కరీంనగర్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం భక్తిశ్రద్ధలతో గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదనపు కలెక్టర్ (రెవెన్యూ) డి. శ్రీనివాస్ రెడ్డి కుటుంబ సమేతంగా వేద మంత్రోచ్చారణల మధ్య పూజలు, అభిషేకం నిర్వహించి నైవేద్యం సమర్పించారు. కార్యక్రమంలో కార్యాలయ సూపరింటెండెంట్లు, పరిపాలనాధికారి, రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. జిల్లా ప్రజలకు సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు కలగాలని, జిల్లాలో అభివృద్ధి కార్యక్రమాలు ఎలాంటి విఘ్నాలు లేకుండా కొనసాగాలని అదనపు కలెక్టర్ ప్రార్థించారు. అనంతరం అధికారులు, సిబ్బందికి తీర్థప్రసాదాలు అందజేశారు.

# పేట బస్టాండ్ ఆవరణలో ఖాళీ జాగా కనిపిస్తే కబ్జా!

- ప్రజా అవసరాలకు ఉపయోగపడాల్సిన భూమిపై కన్నువేసిన అక్రమణ దారులు
- నోరు మెదపని అధికారులు
- నిమ్మకు నీరెత్తినట్లు గ్రామపంచాయతీ ఆర్టీసీ యంత్రాంగం
- బస్సుల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు, ప్రయాణికులకు తప్పని తిప్పలు




**పెద్ద శంకరంపేట, (తెలంగాణ వాణి):**
పెద్ద శంకరాపేట మండల కేంద్రంలోని ప్రధాన బస్టాండ్ ఆవరణలో భూ అక్రమణాల పర్వం అడ్డు అదుపు లేకుండా కొనసాగుతుంది. ఖాళీ స్థలం కనిపిస్తే చాలు హద్దు రాళ్లు పాతడం, రాత్రికి రాత్రి సెల్లు వేసే యడం అక్కడ పరిపాటిగా మారింది. ప్రనికుల వస తులు, బస్సుల పార్కింగ్ కోసం కేటాయించిన విలువైన ప్రభుత్వ భూమిని కొంతమంది భూ బకా సురులు యదేచ్ఛగా అక్రమిస్తున్న సంబంధిత అధికారులు మాత్రం కంటి తుడుపు చర్యలకే పండితమవుతున్నారని స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**అధికారుల నిర్లక్ష్యం.. కబ్జాదారులకు వరం.**

బస్టాండ్ పరిసరాలు ఎంతో విలువైన స్థలం ఉండడంతో, వ్యాపార ప్రయోజనాల కోసం కొంతమంది కబ్జాదారులు కన్నువేశారు. మొదట చిన్నపాకలు, రేకుల షెడ్లతో మొదలుపెట్టి, ఆపై శాశ్వత నిర్మాణాలు చేపట్టేందుకు సిద్ధమవుతున్నారు. ఈ క్రమంలో బస్టాండ్ ఆవరణ రోజురోజుకి కుంచించుకుపోతుంది. దీనిపై గ్రామ పంచాయతీ అధికారులకు, ఆర్టీసీ యాజమాన్యానికి ఫిర్యాదు చేసిన ఇలాంటి స్పందన లేకపోవడంతో కబ్జాదారులకు మరింత ప్రోత్సాహాన్ని ఇచ్చినట్ల అయింది.

**ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు**

బస్టాండ్ ఆవరణ ఆక్రమణకు గురికావడంతో బస్సులు లోపలికి వచ్చి వెళ్లడానికి డ్రైవర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రద్దీగా ఉండే వేళలో బస్సులు సరిగా తిరగలేక, రోడ్డుపైనే ప్రయాణికులను ఎక్కించుకోవలసి వస్తుంది. దీనివల్ల నిత్యం ప్రమాదాలు జరిగే అవకాశాలు పెరిగాయి. దీనిపై గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**చర్యలు తీసుకోకపోతే పోరాటం తప్పదు!**

బస్టాండ్ ఆవరణలోని ఖాళీ స్థలంలో కబ్జాలను వెంటనే తొలగించి, హద్దులు ఏర్పాటు చేయాలని గ్రామానికి చెందిన యువత, ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు. లేనిపక్షంలో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నత కాదు ఉన్నతాధికారులు స్పందించి వెంటనే పెద్ద శంకరంపేట బస్టాండ్ భూములకు రక్షణ కల్పించాలని కోరుతున్నారు.

# కరీంనగర్‌లో 49,025 మంది విద్యార్థులకు 'స్కూల్ బ్రేక్‌ఫాస్ట్'

- సెప్టెంబర్ 16న సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్ ప్రారంభం
- రూ.8 కోట్లతో రోజుకు 50 వేల మందికి అల్పాహారం అందించే సామర్థ్యం
- 669 ప్రభుత్వ పాఠశాలలు, 11 జూనియర్ కళాశాలలకు ప్రయోజనం

**కరీంనగర్, సెప్టెంబర్ 15 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
విద్యార్థుల ఆరోగ్యం, ఏకాగ్రత, పాఠశాల హాజరు, విద్యా సామర్థ్యాన్ని మెరుగుపర్చే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన 'స్కూల్ బ్రేక్‌ఫాస్ట్ ప్రోగ్రామ్'ను కరీంనగర్ జిల్లాలో విస్తరించనుంది. హరే కృష్ణ మూవ్‌మెంట్ చారిటబుల్ ఫౌండేషన్ ఇండియా ఇంప్లిమెంటేషన్ పార్ట్‌నర్‌గా ఈ కార్యక్రమాన్ని అమలు చేయనుంది.

ఇందులో భాగంగా కరీంనగర్ మార్కెట్ యార్డులో సుమారు రూ. 8 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసిన సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్‌ను రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సెప్టెంబర్ 16న ప్రారంభించనున్నారు. ఈ కిచెన్ ద్వారా రోజుకు 50 వేల మంది విద్యార్థులకు అల్పాహారం అందించే సామర్థ్యం ఉంది.

కరీంనగర్, హుస్నాబాద్, చొప్పదండి, మానకొండూర్ నియోజకవర్గాల్లోని 17 మండలాల పరిధిలో ఉన్న 669 ప్రభుత్వ పాఠశాలలు, 11 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుతున్న మొత్తం 49,025 మంది విద్యార్థులకు ప్రతిరోజూ అల్పాహారం అందించనున్నారు.

**ఏకాగ్రత, హాజరు పెంపే లక్ష్యం**

ఉదయం వేళ విద్యార్థులు ఆకలితో ఉండకుండా పోషకాహారంతో కూడిన అల్పాహారం అందించడం ద్వారా తరగతి గదిలో వారి చురుకుదనం, ఏకాగ్రత, జ్ఞానాత్మక సామర్థ్యం, భాగస్వామ్యం, విద్యా పనితీరు మెరుగుపడుతుందని అధికారులు భావిస్తున్నారు. అల్పాహారం అందుబాటులో ఉండటం వల్ల పాఠశాల హాజరు కూడా పెరిగే అవకాశం ఉంది.

ముఖ్యంగా ఉపాధి కోసం తెల్లవారుజామునే పనులకు వెళ్లే పేద, మధ్యతరగతి కుటుంబాల తల్లిదండ్రులకు ఈ కార్యక్రమం ఉపశమనంగా నిలవనుంది. ఆకలి కారణంగా వచ్చే అలసటను నివారించి, విద్యార్థులకు అభ్యాసానికి అవసరమైన శక్తిని అందించడంలో అల్పాహారం కీలకంగా మారనుంది.

**కోడంగల్‌లో విజయవంతమైన పైలెట్ ప్రాజెక్ట్**

స్కూల్ బ్రేక్‌ఫాస్ట్ కార్యక్రమాన్ని 2024 డిసెంబర్‌లో కోడంగల్ నియోజకవర్గంలో పైలెట్ ప్రాజెక్టుగా ప్రారంభించారు. కార్యక్రమం అమలు అనంతరం విద్యార్థుల హాజరు 75 శాతం నుంచి 90 శాతానికి పెరిగినట్లు గుర్తించారు.









అదేవిధంగా ఉదయం వేళ విద్యార్థుల్లో ఏకాగ్రత పెరగడం, తరగతి గదిలో భాగస్వామ్యం మెరుగుపడటం, సమయపాలన పెరగడం, ఆలస్యంగా పాఠశాలకు వచ్చే వారి సంఖ్య తగ్గడం వంటి సానుకూల ఫలితాలు నమోదయ్యాయి. విద్యార్థులు, తల్లిదండ్రులు కూడా కార్యక్రమంపై సంతృప్తి వ్యక్తం చేశారు.

**రాష్ట్రవ్యాప్తంగా విస్తరణ**

కోడంగల్ పైలెట్ ప్రాజెక్టు ఫలితాల నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా స్కూల్ బ్రేక్‌ఫాస్ట్ ప్రోగ్రామ్‌ను విస్తరించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ప్రతిపాదిత అమలు నమూనా ప్రకారం రాష్ట్రంలో సుమారు 17,72,291 మంది విద్యార్థులు, 23,106 ప్రభుత్వ పాఠశాలలు ఈ కార్యక్రమం ద్వారా ప్రయోజనం పొందనున్నాయి.

31 జిల్లాల్లో 31 కేంద్రీకృత మెగా/కమ్యూనిటీ కిచెన్లు, సుమారు 1,400 పంపిణీ వాహనాలు, 5,000 మంది సిబ్బందితో కార్యక్రమాన్ని అమలు చేసేలా ప్రణాళిక రూపొందించారు.

**నాణ్యత, పరిశుభ్రతకు ప్రాధాన్యం**

కేంద్రీకృత కమ్యూనిటీ కిచెన్ల ద్వారా పెద్ద సంఖ్యలో విద్యార్థులకు పోషకమైన, పరిశుభ్రమైన, నాణ్యమైన అల్పాహారాన్ని నిర్ణీత సమయంలో అందించనున్నారు. దోస, మిల్లెట్ ఇడ్లీ, పూరీ తదితర ఆహార పదార్థాలను ఒకే విధమైన నాణ్యతతో తయారు చేసి పాఠశాలలకు సరఫరా చేయనున్నారు.

వంటగది నిర్వహణ బాధ్యతల నుంచి ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బందికి విముక్తి కల్పించి, వారు పూర్తిగా బోధన, విద్యార్థుల అభ్యాసంపై దృష్టి సారించే అవకాశం కల్పించనున్నారు. కిచెన్లలో పరిశుభ్రత, ఆహార భద్రతా ప్రమాణాలను పాటించడంతో పాటు థర్మల్ ఇన్సులేటెడ్ వాహనాల ద్వారా అల్పాహారాన్ని పాఠశాలలకు సకాలంలో తరలించనున్నారు.

ఈ కార్యక్రమం ద్వారా కేంద్రీకృత వంటశాలల్లో ప్రత్యక్షంగా, పరోక్షంగా పెద్ద సంఖ్యలో ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు స్వయం సహాయక సంఘాల సేవలను కూడా కొనసాగించేలా ప్రతిపాదనలు ఉన్నాయి.

**కరీంనగర్‌లో వారపు మెనూ**

విద్యార్థులకు సుపరిచితమైన ఆహార పదార్థాలతో వారపు మెనూను రూపొందించారు. ఆహార వృథాను తగ్గించడంతో పాటు పోషక సమతుల్యత ఉండేలా మెనూను సిద్ధం చేశారు. మెనూ రూపకల్పనలో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్ (చీ×చీ) సహకారం తీసుకున్నారు.

రాష్ట్రవ్యాప్తంగా 31 జిల్లాల్లో 31 కమ్యూనిటీ కిచెన్లను సుమారు రూ. 245 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోంది.

విద్యార్థుల ఆరోగ్యం, విద్య, పోషకాహారం, పాఠశాల హాజరును సమగ్రంగా మెరుగుపరిచి వారి భవిష్యత్తుకు బలమైన పునాది వేయడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. ఆకలితో ఉన్న విద్యార్థి చదువుపై పూర్తిస్థాయి దృష్టి పెట్టలేడని, ప్రతి విద్యార్థి ఆరోగ్యంగా, ఉత్సాహంగా పాఠశాలకు వచ్చి చదువుకోవాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమని తెలిపారు. ఈ అల్పాహార కార్యక్రమం విద్యార్థుల ఆరోగ్యం, విద్యా ప్రమాణాల మెరుగుదలకు దోహదపడటంతో పాటు పేద, మధ్యతరగతి తల్లిదండ్రులకు కూడా ఉపశమనాన్ని కల్పిస్తుందని పేర్కొన్నారు.

**వారపు మెనూ:**

- సోమవారం -- ఇడ్లీ, సాంబార్
- మంగళవారం -- పూరీ, ఆలూ కుర్మా
- బుధవారం -- దోశ, చట్నీ
- గురువారం -- ఉప్మా, చట్నీ
- శుక్రవారం -- మిల్లెట్ ఇడ్లీ, సాంబార్
- శనివారం -- బోండా, చట్నీ

విద్యార్థులకు రోజు విడిచి రోజు పాలు అందించేలా కూడా ఏర్పాట్లు చేస్తున్నారు.

**నియోజకవర్గాల వారీగా విద్యార్థుల వివరాలు**

- హుస్నాబాద్: 16,544 మంది
- మానకొండూర్: 8,645 మంది
- చొప్పదండి: 7,481 మంది
- కరీంనగర్: 16,355 మంది

మొత్తం: 49,025 మంది విద్యార్థులు
రూ. 245 కోట్లతో 31 కమ్యూనిటీ కిచెన్లు

## వరసిద్ధి వినాయకుడి సన్నిధిలో ఎమ్మెల్యే



**నిర్మల్ - తానూర్: సెప్టెంబర్ 15 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
తానూర్ మండలంలోని బోసి గ్రామంలో కొలువైన వరసిద్ధి కర్ర విఘ్నేశ్వరుడిని ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించి జ్ఞాపిక అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వినాయకుడి ఆశీస్సులతో ప్రజలు సుఖసంతోషాలతో సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. సమృద్ధిగా వర్షాలు కురిసి రైతుల ముఖాల్లో ఆనందం వెల్లివిరియాలని కోరుకున్నారు. కార్యక్రమంలో భైంసా మున్సిపల్ చైర్మన్ తుమ్మెల్ల దత్తాత్రి,బీజేపీ నాయకులు,సర్పంచ్‌లు,ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## దోపిడీ కేసులో ఇద్దరికి ఐదేళ్ల జైలు

**నిర్మల్, సెప్టెంబర్ 15 (తెలంగాణ వాణి విలేఖరి)**
: 2017లో నమోదైన దోపిడీ కేసులో ఇద్దరు నిందితులకు నిర్మల్ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి కోర్టు ఐదేళ్ల జైలు శిక్షతో పాటు ఒక్కొక్కరికి రూ.300 జరిమానా విధించింది. 2017 సెప్టెంబర్ 27న అర్ధరాత్రి రామాయంపేట నుంచి ఔరంగాబాద్ వైపు ఈచర్ వాహనంలో వెళ్తున్న మహ్మద్ అజీజ్‌ను సరస్వతీనగర్ సమీపంలో స్కార్పియో వాహనంలో వచ్చిన నలుగురు వ్యక్తులు అడ్డగించి దాడి చేశారు. అనంతరం ఆయన వద్ద ఉన్న రూ.24 వేల నగదు, రూ.13 వేల విలువైన శాంసంగ్ మొబైల్ ఫోన్, డ్రైవింగ్ లైసెన్స్‌ను దోచుకున్నారు. ఘటనపై ముధోల్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. కేసును దర్యాప్తు చేసిన పోలీసులు న్యాయస్థానంలో పక్కా ఆధారాలు సమర్పించడంతో మొహమ్మద్ ఇమ్రాన్ ఖురేషీ (22), నాందేడ్, అన్వర్ ఖాన్ (24), నిజామాబాద్ దోషులుగా తేలారు. సెక్షన్ 235(2) సీఆర్‌పీసీ ప్రకారం కోర్టు ఒక్కొక్కరికి ఐదేళ్ల జైలు, రూ.300 జరిమానా విధించింది. నిందితులకు శిక్ష పడేలా కృషి చేసిన పోలీసు అధికారులు, సిబ్బంది, ప్రాసిక్యూషన్ అధికారులను నిర్మల్ జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల, ఐపీఎస్ అభినందించారు. నేరాలకు పాల్పడిన వారు ఎంతకాలం తర్వాత అయినా చట్టం నుంచి తప్పించుకోలేరని, నేరస్తులకు శిక్ష పడేలా పటిష్ట దర్యాప్తు కొనసాగిస్తామని ఎస్పీ తెలిపారు.

## దండేపల్లి పీహెచ్‌సీలో డీఎంహెచ్‌ఓ తనిఖీ



**మంచిర్యాల, సెప్టెంబర్ 15 (తెలంగాణ వాణి):**
దండేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నరేందర్ రాథోడ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైద్య సేవలు, మందుల నిల్వలు, జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలును పరిశీలించారు. అత్యవసర మందులు, టీకాలు అందుబాటులో ఉంచాలని, గడువు సమీపిస్తున్న మందులను త్వరగా పంపిణీ చేయాలని ఆదేశించారు. మలేరియా, డెంగ్యూ, చికున్‌గున్యా నివారణకు పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని, 30 ఏళ్లు పైబడిన వారికి అసంక్రమిత వ్యాధుల పరీక్షలు నిర్వహించాలని సూచించారు. వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటిస్తూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు.

## శాంతినగర్ పాఠశాలను సందర్శించిన ఎంఇ ఓ



**నిర్మల్, సెప్టెంబరు 15(తెలంగాణ వాణి ప్రతినిధి)**
తెలంగాణ ప్రభుత్వం ఆధ్వర్యంలో విద్యా అభివృద్ధి, పరిశోధన నిమిత్తం జపాన్ దేశంలో విద్యా పర్యటనను విజయవంతంగా పూర్తి చేసుకుని వచ్చిన నిర్మల్ ఎంఇఓ పద్మ శాంతినగర్‌లోని మండల ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల ఎచ్‌ఎం లావణ్య, ఉపాధ్యాయులు జడ్జి పోశెట్టి, సత్యపాల్ రెడ్డి మరియు ఇతర సిబ్బంది, విద్యార్థులు కలిసి ఆమెకు ఆత్మీయ స్వాగతం పలికి పుష్పగుచ్ఛంతో చిన్న సన్మానం చేశారు.జపాన్‌లోని విద్యా విధానాలు, విద్యార్థుల క్రమశిక్షణ, పరిశుభ్రత, నైపుణ్యాభివృద్ధి వంటి అంశాలను అధ్యయనం చేసి తెలంగాణ విద్యా వ్యవస్థ అభివృద్ధికి ఉపయోగపడేలా చేయడం అభినందనీయమని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది మరియు విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

## ముస్లిం మత పెద్దలతో నిర్మల్ జిల్లా ఎస్పీ సమావేశం




**నిర్మల్, సెప్టెంబర్ 15 (తెలంగాణ వాణి విలేఖరి):**
గణేష్ నవరాత్రి ఉత్సవాలు, శోభాయాత్రను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు నిర్మల్ జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల, ఐపీఎస్ ముస్లిం మత పెద్దలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. జిల్లాలో కొనసాగుతున్న సోదరభావం, పరస్పర సహకారం మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు. గణేష్ ఉత్సవాలు, నిమజ్జనం సందర్భంగా ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించి శాంతిభద్రతలు కాపాడాలని సూచించారు. నిమజ్జనం సందర్భంగా తమకు ఉన్న సూచనలు, సమస్యలను మత పెద్దలు ఎస్పీ దృష్టికి తీసుకురాగా, వాటిని సానుకూలంగా పరిశీలించి అవసరమైన సహకారం అందిస్తామని ఆమె హామీ ఇచ్చారు. ప్రజలందరూ సమానమేనని, ఎలాంటి సమస్య ఉన్నా పోలీసులను సంప్రదించవచ్చని ఎస్పీ తెలిపారు. ప్రజల సహకారంతో గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా విజయవంతం చేద్దామని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ డా. జి.బి జానకి షర్మిల, ఐపీఎస్ తో పాటు నిర్మల్ డీఎస్పీ శ్రీనివాస్, సీఐలు కృష్ణ, ప్రవీణ్, సమ్మయ్య మరియు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# విద్యార్థుల సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి

### నాణ్యమైన విద్యతో పాటు ఆరోగ్యం, మౌలిక వసతుల కల్పన



**రామకృష్ణాపూర్, సెప్టెంబర్ 15 (తెలంగాణ వాణి):**
విద్యార్థుల విద్యాభివృద్ధి, ఆరోగ్యం, మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని రాష్ట్ర బొగ్గు గనుల శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి తెలిపారు. రామకృష్ణాపూర్ 5వ వార్డులోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో షేర్ ద విజన్--ఖమ్మం సంస్థ ప్రతినిధి పి. నారాయణ అందించిన వాటర్ బాటిళ్లు, నోట్ పుస్తకాలు, క్రీడా సామగ్రి కిట్లను మంత్రి, జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్‌తో కలిసి విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పాఠశాలల్లో మౌలిక వసతుల మెరుగుదలకు చర్యలు తీసుకుంటున్నామని, రూఫింగ్ పనులకు డీఎంఎఫ్‌టీ నిధుల నుంచి రూ.30 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. విద్యార్థుల కోసం ఆర్‌ఓ ప్లాంట్, ఏకరూప దుస్తులు, క్రీడా సామగ్రి, పౌష్టికాహారం వంటి సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. మెస్ చార్జీలను 40 శాతం పెంచినట్లు తెలిపారు. సోమనపల్లిలో రూ.200 కోట్లతో నిర్మిస్తున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెరిగిందని, నాణ్యమైన విద్యతో పాటు పౌష్టికాహారం, పుస్తకాలు, ఏకరూప దుస్తులు, తాగునీటి సౌకర్యాలు కల్పిస్తున్నామని తెలిపారు. విద్యార్థుల అభ్యసన ఫలితాలను మరింత మెరుగుపరిచేందుకు ఉపాధ్యాయులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, సంస్థ ప్రతినిధులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## రాథోడ్ బాపురావుకు టీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్ష బాధ్యతలు కార్యకర్తల సంబరాలు



**ఆదిలాబాద్, సెప్టెంబర్ 15 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
తెలంగాణ రక్షణ సేన (టీఆర్‌ఎస్) ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడిగా బోథ్ మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు నియమితులైన సందర్భంగా పార్టీ కార్యకర్తలు సంబరాలు నిర్వహించారు. టైలర్స్ కాలనీలోని ఆయన క్యాంపు కార్యాలయం వద్ద టపాసులు పేల్చి, బాపురావుకు అనుకూలంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా బాపురావు మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన పార్టీ అధిష్ఠానానికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాడుతూ, పార్టీని జిల్లాలో మరింత బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలతో కలిసి పనిచేస్తానన్నారు. యువత, రైతులు, పేదలు, బడుగు బలహీన వర్గాల సమస్యలపై ప్రత్యేక దృష్టి సారిస్తానని తెలిపారు.



## విద్యార్థులకు ఆహ్లాదకర వాతావరణంలో విద్య

### కలెక్టర్ భవేశ్ మిశ్రా

**నిర్మల్--ముధోల్, సెప్టెంబర్ 15 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
విద్యార్థులకు ఆహ్లాదకర వాతావరణంలో నాణ్యమైన విద్య అందించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. ముధోల్ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆయన పాఠశాల పరిశుభ్రత, భోజనం, వసతి, సిలబస్ పూర్తి తదితర అంశాలను పరిశీలించారు. పదో తరగతి విద్యార్థులను బోర్డు పరీక్షలకు ఇప్పటి నుంచే ప్రణాళికాబద్ధంగా సిద్ధం చేయాలని సూచించారు. విద్యార్థులతో గణిత లెక్కలు చేయించి ప్రతిభ కనబరిచిన వారికి పెన్నులు అందించి అభినందించారు. నిర్మాణంలో ఉన్న పాఠశాల భవన పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఈఓ భోజన్న, తాహసిల్దార్ శ్రీలత, ఇతర అధికారులు ఉన్నారు.

## నిర్మల్ కొయ్య బొమ్మల సంరక్షణకు ప్రత్యేక చర్యలు

### పొనికి చెట్ల పెంపకానికి ప్రోత్సాహం..

### పుష్కరాల్లో ప్రత్యేక స్టాళ్లు: కలెక్టర్ భవేశ్ మిశ్రా



**నిర్మల్, సెప్టెంబర్ 15 (తెలంగాణ వాణి విలేఖరి):**
నిర్మల్ కొయ్య బొమ్మల కళను పరిరక్షిస్తూ కళాకారులకు ప్రోత్సాహం అందించేందుకు ప్రత్యేక చర్యలు చేపడతామని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా తెలిపారు. మంగళవారం నిర్మల్ కొయ్య బొమ్మల ప్రాంగణాన్ని పరిశీలించిన కలెక్టర్.. బొమ్మల తయారీ, మార్కెటింగ్, కళాకారుల సమస్యలు, పొనికి కర్ర లభ్యతపై వివరాలు తెలుసుకున్నారు. కొయ్య బొమ్మలకు దేశ, విదేశాల్లో గుర్తింపు ఉందని, ఈ కళను భావితరాలకు అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. పొనికి చెట్ల పెంపకానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. రానున్న గోదావరి పుష్కరాలను కొయ్య బొమ్మల మార్కెటింగ్‌కు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. బాసరలో ప్రదర్శన, విక్రయాల కోసం ప్రత్యేక స్టాళ్లు ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. ఈ పరిశీలనలో డీపీవో శ్రీనివాస్, డీవైఎస్ఓ శ్రీకాంత్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ రవి బాబు, తహసీల్దార్ రాజు, అధికారులు, నిర్వాహకులు, సిబ్బంది పాల్గొన్నారు.

## కవి కందూరు నారాయణరెడ్డికి సన్మానం



**వనపర్తి, సెప్టెంబర్ 15 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
కవి, తెలుగు భాషా పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు కందూరు నారాయణరెడ్డిని కొత్త తెలంగాణ చరిత్ర బృందం సభ్యులు ఘనంగా సన్మానించారు. సోమవారం సాహితీ కళా వేదిక ఆధ్వర్యంలో రేడియంట్ హైస్కూల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో శాలువా, జ్ఞాపిక, ప్రశంసాపత్రంతో సత్కరించారు. ఈ సందర్భంగా పలుస శంకర్‌గౌడ్ మాట్లాడుతూ నాలుగు దశాబ్దాల పాటు తెలుగు భాషా ఉపాధ్యాయుడిగా సేవలందించిన నారాయణరెడ్డి, విశ్రాంతి అనంతరం సాహిత్యం, చరిత్ర రంగాల్లో విశేష సేవలు అందిస్తున్నారని కొనియాడారు. ఆయన ఆరు దశాబ్దాల సాహితీ ప్రస్థానంలో ఎన్నో రచనలు, సాహితీ కార్యక్రమాలు నిర్వహించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళావేదిక ప్రతినిధులు దేశి రాములు యాదవ్,బైరోజు చంద్ర శేఖర్,బండారు శ్రీనివాస్,గంధం నాగరాజు, రమేశ్, శైలజ,మైత్రీ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు ఆహ్లాదకర వాతావరణంలో విద్య: కలెక్టర్



**నిర్మల్, సెప్టెంబర్ 15 (తెలంగాణ వాణి విలేఖరి):**
విద్యార్థులకు ఆహ్లాదకరమైన వాతావరణంలో నాణ్యమైన విద్య అందించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. మంగళవారం ముధోల్ కేజీబీవీని ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆయన పాఠశాల పరిసరాల పరిశుభ్రత, విద్యార్థుల హాజరు, వసతి, భోజనం, సిలబస్ పూర్తి తదితర అంశాలను పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని, పదో తరగతి విద్యార్థులను ఇప్పటి నుంచే బోర్డు పరీక్షలకు ప్రణాళికాబద్ధంగా సిద్ధం చేయాలని సూచించారు. విద్యార్థులతో మాట్లాడి వారి చదువు, వసతి, భోజన సదుపాయాలపై వివరాలు తెలుసుకున్నారు. గణిత సమస్యలను విద్యార్థులతో చేయించి ప్రతిభ చూపిన వారికి పెన్నులు అందించి అభినందించారు. నిర్మాణంలో ఉన్న పాఠశాల భవన పనులను త్వరగా పూర్తి చేసి అందుబాటులోకి తేవాలని ఆదేశించారు. ఈ తనిఖీలో డీఈవో భోజన్న, తహసిల్దార్ శ్రీలత, ఎంపీడీవో లవ కుమార్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేద విద్యార్థిని ఇంజనీర్‌గా తీర్చిదిద్దిన గురువు



**నర్సంపేట, సెప్టెంబర్ 15 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
గురువు అంటే పాఠాలు చెప్పడమే కాదు.. శిష్యుల జీవితానికి బాటలు వేయడమని ఉపాధ్యాయుడు మూసా మహమ్మద్ నిరూపించారని దుగ్గొండి మండలం ముద్దునూరుకు చెందిన ఇంజనీర్ కోయిల సాంబయ్య అన్నారు. 2000లో నిరుపేద విద్యార్థులైన తనకు, తన మిత్రుడు వీరన్నకు మూసా మహమ్మద్ ఉచితంగా మ్యాథ్స్, ఫిజిక్స్ బోధించారని తెలిపారు. ఎంసెట్‌లో ర్యాంకు సాధించిన తర్వాత కౌన్సెలింగ్‌కు రూ.10 వేలు అవసరం కాగా, అప్పు చేసి ఆర్థిక సాయం చేయడంతో పాటు స్వయంగా కౌన్సెలింగ్‌కు తీసుకెళ్లి పాల్వంచ ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాలలో మైనింగ్ ఇంజనీరింగ్ సీటు వచ్చేలా సహకరించారని గుర్తుచేశారు. గురువు అందించిన మార్గదర్శకత్వంతో ఇంజనీరింగ్ పూర్తి చేసి ఉద్యోగం సాధించానని, తన ఎదుగుదలకు మూసా మహమ్మద్ ప్రధాన కారణమని సాంబయ్య పేర్కొన్నారు. ఇప్పటికీ పేద విద్యార్థులకు ఉచితంగా విద్యాబోధన చేస్తూ అండగా నిలుస్తున్న గురువును ప్రతి ఇంజనీర్స్ డే సందర్భంగా సన్మానించుకుంటున్నానని తెలిపారు.



## పేకాట స్థావరంపై పోలీసుల దాడి

### నలుగురు అరెస్ట్

**ఎల్లారెడ్డి, సెప్టెంబర్ 15 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
కామారెడ్డి జిల్లా సదాశివనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసి నలుగురిని అరెస్ట్ చేశారు. ఎస్సై పుష్పరాజు ఆధ్వర్యంలో సంతోష్‌రెడ్డి పౌల్ట్రీ ఫామ్‌పై దాడి నిర్వహించారు. పేకాట ఆడుతున్న నలుగురి నుంచి రూ.2,080 నగదు, నాలుగు మొబైల్ ఫోన్లు, నాలుగు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. జూదం చట్టరీత్యా నేరమని, జూదానికి పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎస్సై పుష్పరాజు హెచ్చరించారు. ప్రజలు జూదానికి దూరంగా ఉండి తమ సమయాన్ని కుటుంబం, పిల్లల భవిష్యత్తు కోసం వినియోగించుకోవాలని సూచించారు.

## డీజే నిబంధనల ఉల్లంఘనపై కేసు

### డీజే వాహనం, సామగ్రి సీజ్




**ఎల్లారెడ్డి, సెప్టెంబర్ 15 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
కామారెడ్డి జిల్లా సదాశివనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని వజ్జేపల్లి గ్రామంలో నిబంధనలకు విరుద్ధంగా డీజే నిర్వహిస్తున్నారన్న ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు. ధగడ్ యూత్ ఆధ్వర్యంలో డీజే నిర్వహిస్తున్నట్లు గుర్తించిన పోలీసులు నిర్వాహకులతో పాటు డీజే యజమాని, ఆపరేటర్‌పై కేసు నమోదు చేసి డీజే వాహనం, సామగ్రిని సీజ్ చేశారు. సుప్రీం కోర్టు మార్గదర్శకాలు, పోలీస్ శాఖ నిబంధనలకు విరుద్ధంగా డీజేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని సదాశివనగర్ ఎస్సై పుష్పరాజ్ హెచ్చరించారు. ప్రజలు శాంతియుత వాతావరణం కాపాడేందుకు పోలీసులకు సహకరించాలని కోరారు.

## కాంగ్రెస్‌లో చేరిన ముదేలి సర్పంచ్ లక్ష్మణ్



**ఎల్లారెడ్డి, సెప్టెంబర్ 15 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
గాంధారి మండలం ముదేలి గ్రామ సర్పంచ్ లక్ష్మణ్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు నివాసంలో జరిగిన కార్యక్రమంలో ఆయనకు ఎమ్మెల్యే కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ.. ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు నియోజకవర్గంలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితుడై కాంగ్రెస్‌లో చేరినట్లు తెలిపారు. ఎమ్మెల్యే నాయకత్వంలో ముదేలి గ్రామ అభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

## ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలి




**రామకృష్ణాపూర్, సెప్టెంబర్ 15 (తెలంగాణ వాణి):**
కేకే--5 గనిలో సోమవారం రాత్రి షిఫ్ట్‌లో ప్రమాదానికి గురై గాయపడిన ఎస్‌డీఎల్ ఆపరేటర్ కస్తూరి శంకర్ ను సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ సీఐటీయూ మందమర్రి బ్రాంచ్ అధ్యక్షులు ఎస్ వెంకట స్వామి ఏరియా ఆస్పత్రిలో పరామర్శించారు. బొగ్గు తీసే సమయంలో పైకప్పు బండ పడటంతో ప్రమాదం జరిగినట్లు తెలిపారు. మెరుగైన వైద్యం కోసం ఆయనను రిఫర్ చేసినట్లు పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నైట్ షిఫ్ట్‌లలో కార్మికుల హాజరు తక్కువగా ఉన్నప్పటికీ ఉత్పత్తి లక్ష్యంతో యంత్రాలు నడపడం వల్ల ప్రమాదాల ముప్పు పెరుగుతుందన్నారు. కేకే--5 గనిలో డీపిల్లరింగ్ జరుగుతున్నందున తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సిబ్బంది కొరత ఉన్నప్పుడు కార్మికులపై అధిక పనిభారం మోపరాదన్నారు. కార్మికులకు నాణ్యమైన రక్షణ పరికరాలు, బూట్లు, పనిముట్లు అందించాలని కోరారు. సేఫ్టీ సమావేశాల ద్వారా ప్రమాదాలపై అవగాహన కల్పించి, ఉత్పత్తి కంటే కార్మికుల ప్రాణ భద్రతకే యాజమాన్యం ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేశారు.

## దేవాదుల ప్రాజెక్టుపై 27న సదస్సు

### మేధావులు, తెలంగాణవాదులు తరలిరావాలి : ప్రొఫెసర్ దినేష్ కుమార్



**హనుమకొండ, సెప్టెంబర్ 15 (తెలంగాణ వాణి):**

దేవాదుల ప్రాజెక్టు పనుల పురోగతి, నాడు--నేడు పరిస్థితులపై ఈ నెల 27న హనుమకొండలో సదస్సు నిర్వహించనున్నట్లు కేయూ రిటైర్డ్ ప్రొఫెసర్ చింతకాయల దినేష్ కుమార్ తెలిపారు. తెలంగాణ వికాస సమితి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. దేవాదుల ప్రాజెక్టు ద్వారా ఉమ్మడి వరంగల్‌తో పాటు పలు జిల్లాలకు సాగు, తాగునీరు అందించే అవకాశం ఉన్నప్పటికీ పనుల్లో జాప్యం జరుగుతోందని అన్నారు. ప్రాజెక్టు ప్రస్తుత పరిస్థితి, గత పనులు, భవిష్యత్ కార్యాచరణపై సదస్సులో చర్చిస్తామని తెలిపారు. మేధావులు, తెలంగాణవాదులు, ప్రజా సంఘాల ప్రతినిధులు, రైతులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో తెలంగాణ వికాస సమితి నాయకులు భిక్షపతి నాయక్,మేడిపల్లి శోభన్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రమేష్ బాబు, ఆత్మకూరు మార్కెట్ కమిటీ చైర్మన్ రవి, న్యాయవాదులు శివరాజ్, కిరణ్, శ్రీనివాస్, కేయూ స్కాలర్స్ కత్తేరపల్లి దామోదర్, డా.పాలమాకుల కొమురయ్య, డా.మోటె చిరంజీవి, డా.జెట్టి రాజేందర్,రాజగోపాల్, తిరుపతి, నాగరాజ్, ప్రశాంత్,రమేష్, సీతారాం, కిరణ్, శ్రీనివాస్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేదల పాలిట వరం సీఎం సహాయనిధి

### సర్పంచ్ సురుగు గౌరి శ్రీనివాస్ గౌడ్



**చౌటుప్పల్, సెప్టెంబర్ 15 (తెలంగాణ వాణి డివిజన్ ప్రతినిధి):**

అనారోగ్యంతో బాధపడుతున్న నిరుపేదలకు సీఎం సహాయనిధి వరంలాంటిదని సర్పంచ్ సురుగు గౌరి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సహకారంతో మంజూరైన సీఎం సహాయనిధి చెక్కులను మంగళవారం దేవలమ్మ నాగారం గ్రామానికి చెందిన గుడ్డేటి మమతకు రూ.34 వేలు, రావిరాల అంజయ్యకు రూ.21 వేలను ఆమె అందజేశారు. నిరుపేదల వైద్య ఖర్చులకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని, సహాయనిధి చెక్కుల మంజూరుకు సహకరించిన ఎమ్మెల్యేకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు బొమ్మ మైసయ్య, ఆదిమూలం శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ విమోచన దినాన్ని అధికారికంగా నిర్వహించాలి

### బీజేపీ రాష్ట్ర నాయకులు డాక్టర్ గంగిడి మనోహర్ రెడ్డి



**చౌటుప్పల్, సెప్టెంబర్ 15 (తెలంగాణ వాణి డివిజన్ ప్రతినిధి):**

తెలంగాణ విమోచన దినమైన సెప్టెంబర్ 17ను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని బీజేపీ రాష్ట్ర నాయకులు డాక్టర్ గంగిడి మనోహర్ రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం చౌటుప్పల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నిజాం నిరంకుశ పాలన నుంచి తెలంగాణకు విముక్తి లభించిన సెప్టెంబర్ 17ను అధికారికంగా నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజలు తమ వీధుల్లో త్రివర్ణ పతాకాలను ఎగురవేసి విమోచన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు కడారి కల్పన ఐలయ్య యాదవ్, రూరల్ అధ్యక్షులు కైరం కొండ అశోక్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దూడలు బిక్షం గౌడ్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బుడ్డ సురేష్ కౌన్సిలర్ పోలపల్లి లక్ష్మి ముత్తయ్య, సీనియర్ నాయకులు రమణ గోని శంకర్,ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి చినుకుని మల్లేశం, ముత్యాల భూపాల్ రెడ్డి,పోలోజు శ్రీధర్ బాబు, భవనం మధుసూదన్ రెడ్డి, రెక్కల సుధాకర్ రెడ్డి, కట్ట కృష్ణ, సర్పంచ్లు తంగళ్ళ వెంకటేశం, నందగిరి వెంకటేశం గౌడ్,బత్తుల జంగయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## మండల అధ్యక్షుడిగా మీసాల వీరస్వామి ఏకగ్రీవ ఎన్నిక



**వనపర్తి, సెప్టెంబర్ 15 (తెలంగాణ వాణి ప్రతినిధి):**

వనపర్తి జిల్లా వీపనగండ్ల మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా మీసాల వీరస్వామిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్పీఆర్డీ ఇండియా వనపర్తి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఆది జనార్ధన్, జిల్లా కార్యదర్శి సుశీల, నరసమ్మ, గోవిందమ్మ ఆధ్వర్యంలో కమిటీ ఎన్నిక జరిగింది. దివ్యాంగుల హక్కుల సాధన, సమస్యల పరిష్కారం, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా కృషి చేస్తామని వీరస్వామి తెలిపారు. నూతన కమిటీకి జిల్లా నాయకులు, కార్యకర్తలు అభినందనలు తెలిపారు.

# హనుమకొండలో అస్మిత సాఫ్ట్ టెన్నిస్ సందడి

- సాఫ్ట్ టెన్నిస్ క్రీడకు మరింత ప్రోత్సాహం
  :డి వై ఎస్ ఓ కొత్త ప్రశాంత్
- క్రీడాకారులు క్రమశిక్షణతో సాధన చేయాలి
  :ఆఫీసర్స్ క్లబ్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ప్రవీణ్
- జాతీయ స్థాయిలో రాణించేలా కృషి చేయాలి:పి వెంకటేశ్వరరావు
- జిల్లాలో క్రీడాభివృద్ధి కృషి చేయాలి :సాఫ్ట్ టెన్నిస్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు



**హనుమకొండ:సెప్టెంబర్15 (తెలంగాణ వాణి ప్రతినిది)**

సాఫ్ట్ టెన్నిస్ క్రీడను జిల్లాలో మరింత ప్రోత్సహించి,ప్రతిభ కలిగిన క్రీడాకారులను రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించేలా తీర్చిదిద్దాలని హనుమకొండ జిల్లా యువజన క్రీడా అధికారి కొత్త ప్రశాంత్ అన్నారు. జేఎన్ఎస్ స్టేడియంలో నిర్వహించిన హనుమకొండ--వరంగల్ జిల్లా స్థాయి అస్మిత సాఫ్ట్ టెన్నిస్ బాలికల లీగ్ 2026--27 పోటీలకు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు.సాఫ్ట్ టెన్నిస్ శారీరక దృఢత్వంతో పాటు చురుకుదనం,ఏకాగ్రత, నిర్ణయ సామర్థ్యాన్ని పెంపొందిస్తుందని అన్నారు. చిన్ననాటి నుంచే క్రీడలపై ఆసక్తి పెంచుకుని క్రమశిక్షణతో సాధన చేస్తే ఉన్నత స్థాయికి ఎదగవచ్చని సూచించారు. ప్రముఖ వైద్యుడు,వరంగల్ ఆఫీసర్స్ క్లబ్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ప్రవీణ్ మాట్లాడుతూ క్రీడలు ఆరోగ్యంతో పాటు మానసిక ఉల్లాసాన్ని అందిస్తాయని అన్నారు. సాఫ్ట్ టెన్నిస్ వంటి క్రీడలకు ప్రోత్సాహం అందించడం ద్వారా యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించవచ్చని పేర్కొన్నారు.సమావేశానికి అధ్యక్షత వహించిన సాఫ్ట్ టెన్నిస్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ జుజ్జురి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ జిల్లాలో సాఫ్ట్ టెన్నిస్ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. జిల్లా స్థాయి పోటీలు క్రీడాకారులకు తమ ప్రతిభను నిరూపించుకునేందుకు మంచి వేదికగా నిలుస్తాయని అన్నారు. కేంద్ర ప్రభుత్వం మహిళలను క్రీడను ప్రోత్సహించాలని అస్మితా ఆధ్వర్యంలో పోటీలను నిర్వహిస్తుందని తెలిపారు. బాలికల విభాగంలో అండర్ -14 17, సీనియర్స్ మహిళలకు ఈ పోటీలు నిర్వహించామని తెలిపారు. హనుమకొండ టెన్నిస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ప్రొఫెసర్ ఎర్రగట్టు స్వామి మాట్లాడుతూ క్రీడాకారులకు మెరుగైన శిక్షణ, పోటీ అనుభవం కల్పించేందుకు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు.



ఎల్‌పీజీ గ్యాస్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు సమాజంలోని ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని అన్నారు.హనుమకొండ జిల్లా టెన్నిస్ అసోసియేషన్ పాట్రన్ రవిచంద్ర మాట్లాడుతూ చిన్ననాటి నుంచే క్రీడాకారులకు సరైన శిక్షణ, పోటీ వాతావరణం కల్పిస్తే వారు ఉన్నత స్థాయిలో రాణిస్తారని అన్నారు. సాఫ్ట్ టెన్నిస్ అభివృద్ధికి అవసరమైన సహకారం అందిస్తామని తెలిపారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. సీఐ వెంకటనారాయణ, సిరికొండ సుదర్శన్ తదితరులు క్రీడాకారులను అభినందించారు.ఈ కార్యక్రమంలో ఆర్గనైజింగ్ సెక్రెటరీ వెంకటేశ్వర్లు,కోచ్‌లు రమేష్,విష్ణువర్ధన్,వరంగల్ సాఫ్ట్ టెన్నిస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రమేష్, జుజ్జూరి జితేంద్ర కుమార్, మల్లయ్య,కరిత,స్వరూప తదితరులు పాల్గొన్నారు.



## విమోచన దినోత్సవం అధికారికంగా నిర్వహించాలి

### బీజేపీ నాయకుల వినతి

**కోరుట్ల రూరల్, సెప్టెంబర్ 15 (తెలంగాణ వాణి):**

సెప్టెంబర్ 17 తెలంగాణ విమోచన దినోత్సవాన్ని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని కోరుతూ బీజేపీ కోరుట్ల మండల అధ్యక్షుడు పంచిరి విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం తహసీల్దార్ కృష్ణ చైతన్యకు వినతిపత్రం అందజేశారు. విమోచన దినోత్సవాన్ని ప్రభుత్వం అధికారిక జీవో జారీ చేసి అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ఘనంగా నిర్వహించాలని బీజేపీ నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల జిల్లా ఉపాధ్యక్షులు గుగ్గిళ్ళ తుకారాం గౌడ్, మండల ప్రధాన కార్యదర్శులు విట్టల్ రాజేందర్ రెడ్డి, గోపు ప్రశాంత్, కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు ఏలేటి రాజు, బీజేవైఎం మండల అధ్యక్షుడు రాజు, బిజెపి సీనియర్ నాయకులు లింగారెడ్డి, అవునూరి రాజు, భూమానందం, శేఖర్, పుంద్ర విజయ్, మహేష్, బండ వంశీ పాల్గొన్నారు

## అంబేద్కర్‌పై పుస్తక విడుదలను అడ్డుకోవాలి



**నాగిరెడ్డిపేట్, సెప్టెంబర్ 15 (తెలంగాణ వాణి ప్రతినిధి):**

డా. బి.ఆర్. అంబేద్కర్‌పై హమారా ప్రసాద్ రచించిన 'కల్పిత నాయకుడు' పుస్తకాన్ని ఈ నెల 18న విడుదల చేయనున్న నేపథ్యంలో, దాని విడుదలను నిలిపివేయాలని కోరుతూ నాగిరెడ్డిపేట్ ఎస్ఐ భార్గవ్ గౌడ్, ఎంఆర్వో బిక్షపతికి వినతిపత్రం అందజేశారు. పుస్తకంలో అంబేద్కర్ ప్రతిష్ఠకు భంగం కలిగించే అభ్యంతరకర అంశాలుంటే విచారణ జరిపి విడుదలను అడ్డుకోవడంతో పాటు, సంబంధిత వ్యక్తిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు అంబేద్కర్ అభిమానులు, నాగిరెడ్డి పేట మండల ఎంఆర్పిఎస్ సీనియర్ నాయకులు సాయిలు , ఊషయ్య ,సురేందర్ , రవి, తిమోతి తదితరులు పాల్గొన్నారు

## ఇంజనీర్ల దినోత్సవం ఘనంగా

**ధర్మారం, సెప్టెంబర్ 15 (తెలంగాణ వాణి):**



లయన్స్ క్లబ్ ఆఫ్ ధర్మారం ఆధ్వర్యంలో జాతీయ ఇంజనీర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యుత్ శాఖ ఏఈలు ఏనుగు మునీందర్ రెడ్డి, మైపాల్ రెడ్డి, సబ్ ఇంజనీర్లు ప్రణయ్ కుమార్, సందీప్, దిలీప్‌లను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. వారి సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు చింతపండు నర్సింగం, డిస్టిక్ మైక్రో క్యాబినెట్ సభ్యులు సామా ఎల్లారెడ్డి, జోనల్ చైర్మన్ తలమక్కి రవీందర్ శెట్టి, జిల్లా నాయకులు మునీందర్ రెడ్డి, లయన్స్ క్లబ్ కార్యదర్శి కట్ట రమేష్, కోశాధికారి కదారి కుమార్, మిట్టపల్లి చంద్రకాంత్ రెడ్డి, అక్కినపల్లి చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఆధార్ నమోదు, నవీకరణ ప్రక్రియను వేగవంతం చేయాలి

### జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్

**జగిత్యాల, సెప్టెంబర్ 15 (తెలంగాణ వాణి ప్రతినిధి):**



జిల్లాలో ఆధార్ నమోదు, వివరాల నవీకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ అధికారులను ఆదేశి ంచారు. మంగళవారం కలెక్టరేట్‌లో అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. జిల్లాలో 13,15,376 మందికి ఆధార్ నమోదు, అవసరమైన నవీకరణలు పూర్తి చేయాల్సి ఉందన్నారు. ఆరేళ్లు నిండిన ప్రతి చిన్నారికి బయోమెట్రిక్ నవీకరణ జరిగేలా చూడాలని సూచించారు. గత ఆరు నెలల్లో జరిగిన ప్రసవాల వివరాలను ఆధార్ నమోదుతో సరిపోల్చి, ప్రతి శిశువుకు ఆధార్ నమోదు జరిగేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ఇతర విద్యాసంస్థల్లో ప్రత్యేక ఆధార్ శిబిరాలు ఏర్పాటు చేసి పెండింగ్ ప్రక్రియను పూర్తి చేయాలని తెలిపారు. వైద్య, విద్య, మహిళా శిశు సంక్షేమ శాఖలు సమన్వయంతో పనిచేసి ఆధార్ నమోదు, నవీకరణలో జాప్యం లేకుండా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి.ఎస్.లత, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) బి.రాజ గౌడ్ సంబంధిత జిల్లా అధికారులు, వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా సుజాత, విద్యాశాఖ అధికారి రాము, మహిళా శిశు సంక్షేమశాఖ అధికారి డా.భాస్కర్, ఆధార్ నమోదు కేంద్రాల ప్రతినిధులు, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## గర్భిణీ స్త్రీలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

### జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్



**చేగుంట : సెప్టెంబర్ 15(తెలంగాణ వాణి ప్రతినిధి)**

గర్భిణీ స్త్రీలపై డాక్టర్లు ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ వైద్య సిబ్బందిని ఆదేశించారు మంగళవారం చేగుంటలోని పిహెచ్సి ని ఆకస్మికంగా తనిఖీ చేశారు వైద్య సేవలపై ఆరా తీశారు వైద్యం ఎలా అందుతుంది అని అడిగి తెలుసుకున్నారు రూములు మెడికల్ స్టోర్ ను, డాక్టర్ల సమయపాలన హాజరు పుస్తకాలను తనిఖీ చేశారు ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్ మాట్లాడుతూ నెలలు నిండుతున్న గర్భిణీలపై వైద్యాధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని, హైరిస్కు కేసులను ఎలా పరిష్కరిస్తున్నారని హైరిస్కు కేసుల విషయంలో జిల్లా ఆస్పత్రి నుంచి ట్యాగ్ చేయాలన్నారు. పేదలకు మెరుగైన వైద్యం అందాలని వైద్య సిబ్బంది సమయపాలన పాటించాలని, ఆసుపత్రి వాతావరణం పరిశుభ్రంగా ఉండాలని అధికారులకు సూచించారు ఈ కార్యక్రమంలో డాక్టర్లు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలి

### బీజేపీ వనపర్తి మండల అధ్యక్షుడు సంద వెంకటేష్



**వనపర్తి, సెప్టెంబర్ 15 (తెలంగాణ వాణి ప్రతినిధి)**

: సెప్టెంబర్ 17 తెలంగాణ విమోచన దినోత్సవాన్ని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని బీజేపీ వనపర్తి మండల అధ్యక్షుడు సంద వెంకటేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం తహసీల్దార్ ఎం. రమేష్‌రెడ్డికి బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు.నిజాం, రజాకార్ల నిరంకుశ పాలన నుంచి తెలంగాణ విముక్తి కోసం ఎందరో రైతులు, మహిళలు, యువకులు ప్రాణత్యాగాలు చేశారని తెలిపారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ నేతృత్వంలో చేపట్టిన ఆపరేషన్ పోలో అనంతరం 1948 సెప్టెంబర్ 17న తెలంగాణ భారతదేశంలో విలీనమైందన్నారు. విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించి, అమరుల త్యాగాలను భావితరాలకు తెలియజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బుడ్డన్న, వనపర్తి జిల్లా జనరల్ సెక్రెటరీ పెద్ది రాజు, వనపర్తి రూరల్ మండలం జిఎస్ వాకిటి సుదర్శన్, వనపర్తి పట్టణ అధ్యక్షులు బత్తిని మధుసూదన్, వారాల సంపత్, రెడ్యానాయక్ వనపర్తి మండలం కార్యదర్శులు, వనపర్తి మండల ఎస్టీ మోర్చా అధ్యక్షులు వస్య రామ్, డి సత్యనారాయణ రావు గారు, , కే వెంకటేష్ నాయక్, చిన్నరాయుడు కార్యకర్తలు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## బీజేపీ దివ్యాంగుల సెల్ రాష్ట్ర కో-కన్వీనర్ కి సన్మానం



**వనపర్తి : సెప్టెంబర్ 15, (తెలంగాణ వాణి ప్రతినిధి)**

బీజేపీ దివ్యాంగుల సెల్ రాష్ట్ర కో-కన్వీనర్‌గా బాధ్యతలు చేపట్టిన బెస్త యాదగిరిని, ఆయన సొంత మండలం గణపురంలో బీజేపీ మండల అధ్యక్షులు బుచ్చిబాబు ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి గోపి ముదిరాజు, కార్యదర్శి దశరథం, నవీన్, సత్యం, రాము, అక్బర్, ఆంజనేయులు పాల్గొని బెస్త యాదగిరి ని శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు.రాష్ట్రస్థాయిలో దివ్యాంగుల సంక్షేమం, హక్కుల పరిరక్షణ కోసం మరింత కృషి చేయాలని నాయకులు ఆకాంక్షించారు.

## స్వయం సహాయక సంఘాల అభివృద్ధికి కృషి చేయాలి

### జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా



**నిర్మల్, సెప్టెంబర్ 15 (తెలంగాణ వాణి విలేఖరి):**

జిల్లాలో స్వయం సహాయక సంఘాల అభివృద్ధికి అధికారులు నిరంతరం కృషి చేయాలని కలెక్టర్ భవేశ్ మిశ్రా ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో డీఆర్‌డీఏ అంశాలపై నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. అర్హులైన ప్రతి మహిళను స్వయం సహాయక సంఘాల్లో చేర్చాలని, రుణ లక్ష్యాలను గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. మహిళలకు రుణాలు అందించి స్వయం ఉపాధి ద్వారా ఆర్థికంగా ఎదిగేలా ప్రోత్సహించాలన్నారు. ఎస్‌హెచ్‌జీ సభ్యులకు ఆర్థిక అక్షరాస్యత, డిజిటల్ చెల్లింపులపై అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో డిఆర్డిఓ విజయలక్ష్మి, ఎల్డీఎం రామ్ గోపాల్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## గ్రామస్తులతో చర్చించిన నాంపల్లి ఎమ్మార్వో



**నాంపల్లి, సెప్టెంబర్ 15 (తెలంగాణ వాణి ప్రతినిధి):**

సుంకిశాల గ్రామంలో పాత ఊరు ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్లు రద్దు చేయాలని గ్రామస్తులు చేపట్టిన నిరసన దీక్ష నాలుగో రోజుకు చేరింది. మంగళవారం ఎమ్మార్వో ఆంజనేయులు దీక్షా స్థలానికి చేరుకుని గ్రామస్తులతో చర్చించి ఇళ్ల స్థలాలను పరిశీలించారు. సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. శుక్రవారం వరకు సమయం ఇవ్వాలని, తనపై నమ్మకం ఉంచి దీక్ష విరమించాలని కోరారు. ఎమ్మార్వో హామీతో గ్రామస్తులు దీక్ష విరమించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బాషిపాక రాములు, వార్డు సభ్యులు కలకొండ లక్ష్మయ్య, బుడిగపాక ధనమ్మ , వాడపల్లి లావణ్య, నేరేడుగోమ్ము సత్యనారాయణ, కాటిక ఇదెమ్మ, ఎడమ మల్లేష్, ఆంజనేయులు, దేవేందర్, హరీష్, కిరణ్, రమేష్, ఎర్రయ్య, లింగయ్య, తదితరులు పాల్గొన్నారు.

## మైనర్ బాలికపై లైంగిక దాడి



**ధర్మారం, సెప్టెంబర్ 15 (తెలంగాణ వాణి):**
పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం నరసింహులపల్లిలో మైనర్ బాలికపై లైంగిక దాడి జరిగిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గ్రామానికి చెందిన ఓ వ్యక్తి మాయమాటలు చెప్పి బాలికపై లైంగిక దాడికి పాల్పడినట్లు సమాచారం. బాలిక పాఠశాలకు వెళ్లకుండా ఇంటివద్ద ఉండటంతో తండ్రి ఆరా తీయగా విషయం వెల్లడించింది. తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు బాలిక వాంగ్మూలాన్ని నమోదు చేసి నిందితుడిపై కేసు నమోదు చేశారు. ప్రస్తుతం నిందితుడు పరారీలో ఉన్నట్లు, బాలికను సంరక్షణ కేంద్రానికి తరలించినట్లు తెలిసింది. నిందితుడిని త్వరలో అరెస్టు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.

## పాత భవనానికి తాత్కాలిక రక్షణ



**తిమ్మాపూర్, సెప్టెంబర్ 15 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
మన్నెంపల్లి గ్రామంలోని పాత గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రస్తుత స్థితిలోనే కొనసాగించాలని మండల ప్రజాపరిషత్ అధికారులు ఆదేశించారు. తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు భవనం కూల్చివేత, మార్పులు చేర్పులు, కొత్త నిర్మాణాలను నిషేధించారు. భవనం శిథిలావస్థలో ఉందని జనవరి 28న పీఆర్ సబ్‌డివిజన్ డీఈఈ సౌండ్నెస్ సర్టిఫికెట్ జారీ చేశారు. భవనం వద్ద ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీవో, పీఆర్ ఏఈ, పంచాయతీ కార్యదర్శిని అధికారులు ఆదేశించారు.

## పాల కేంద్రాల్లో ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీ



**జగిత్యాల, సెప్టెంబర్ 15 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
: చైతన్య డైరీ పాల ప్యాకెట్‌లో గమ్‌లాంటి పదార్థం కనిపించిందంటూ వినియోగదారు చేసిన ఫిర్యాదు మేరకు ఫుడ్ సేఫ్టీ అధికారులు జగిత్యాల పట్టణంలోని పలు పాల డైరీలు, విక్రయ కేంద్రాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ అనూష ఆధ్వర్యంలో పాల నమూనాలను సేకరించి పరీక్షల కోసం గుర్తింపు పొందిన ల్యాబ్‌కు పంపించారు. ల్యాబ్ నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. నిబంధనల ఉల్లంఘన తేలితే చట్టపరమైన చర్యలు, అవసరమైతే సంస్థ సీజ్‌కు కూడా చర్యలు చేపడతామని స్పష్టం చేశారు.

## నేడు రంగంపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ అంతరాయం

**పెద్దపల్లి, సెప్టెంబర్ 16 (తెలంగాణ వాణి జిల్లా ప్రతినిధి):**



33/11 కేవీ రంగంపల్లి సబ్‌స్టేషన్ పరిధిలోని నూతన వ్యవసాయ మార్కెట్ సబ్‌స్టేషన్‌లో విద్యుత్ పనుల కారణంగా బుధవారం ఉదయం 9.30 నుంచి 11 గంటల వరకు సరఫరాకు అంతరాయం ఉంటుందని అధికారులు తెలిపారు. భూమ్‌నగర్, టీచర్స్ కాలనీ, శివపురి కాలనీ, కూనారం రోడ్, వ్యవసాయ మార్కెట్ ప్రాంతాల వినియోగదారులు సహకరించాలని అదనపు సహాయ ఇంజనీర్ సీహెచ్. శ్రీనివాస్ కోరారు.

## కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ నాయకులు



**పెద్దపల్లి, సెప్టెంబర్ 15 (తెలంగాణ వాణి జిల్లా ప్రతినిధి):**
రామగుండం నియోజకవర్గానికి చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఎండీ గౌస్ బాబా, బి. కళ్యాణ్, తాటికొండ గట్టయ్య, నిప్పు సురేష్‌లకు ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఎమ్మెల్యే ఆధ్వర్యంలో నియోజకవర్గ అభివృద్ధి కొనసాగుతోందని, కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేస్తామని వారు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్పొరేటర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వచ్చే విద్యాసంవత్సరంలో యంగ్ ఇండియా స్కూల్

**తిమ్మాపూర్, సెప్టెంబరు 15 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
పేద, మధ్యతరగతి విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్య, పేదలకు మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యంగా నియోజకవర్గంలో విద్యా, వైద్య రంగాలను అభివృద్ధి చేస్తున్నట్లు మానకొండూర్ ఎమ్మెల్యే డా. కవ్వంపల్లి సత్యనారాయణ తెలిపారు. యాదవులపల్లిలో నిర్మిస్తున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ పనులను పరిశీలించి, వచ్చే విద్యాసంవత్సరం నాటికి అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. అనంతరం మానకొండూర్‌లో నిర్మిస్తున్న 50 పడకల ఆస్పత్రి పనులను పరిశీలించి, వచ్చే ఏడాది జూన్‌కల్లా పూర్తి చేయాలని సూచించారు. అనంతరం పాఠశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమాల్లో మెగా ప్రాజెక్ట్ మేనేజర్ అమరేందర్‌రెడ్డి, డీఈ కృష్ణకుమార్, ఏఈ మీస రమేశ్,



ఈఈ విశ్వప్రసాద్, ఏఈలు అర్బజ్, మీస రమేశ్, తహసీల్దార్లు కర్ర శ్రీనివాస్‌రెడ్డి, విజయ్‌కుమార్, వైద్యాధికారి డా. సల్మాన్, కాంట్రాక్టర్ మేడి రమేష్, సర్పంచ్ గంగిడి లక్ష్మారెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బండారి రమేష్ గౌడ్, ప్యాక్స్ చైర్మన్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా వినాయక చవితి వేడుకలు

**పెద్దపల్లి, సెప్టెంబర్ 15 (తెలంగాణ వాణి జిల్లా ప్రతినిధి):**
రామగుండం పోలీస్ కమిషనరేట్ హెడ్‌క్వార్టర్స్‌లో వినాయక చవితి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సీపీ అంబర్ కిషోర్ ఝా అధికారులతో కలిసి గణేష్ విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలకు, పోలీసు అధికారులు, సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు. నవరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని, నిమజ్జన శోభాయాత్ర వరకు పోలీసులకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ కె. శ్రీనివాస్, ఏసీపీ నాగేంద్ర గౌడ్, ఆర్ఐలు, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, పోలీస్ అధికారుల సంఘం ప్రతినిధులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నవంబర్ నెలాఖరులోగా అభివృద్ధి పనులు పూర్తి చేయాలి



**పెద్దపల్లి, సెప్టెంబర్ 15 (తెలంగాణ వాణి జిల్లా ప్రతినిధి):**
పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ ఆధ్వర్యంలో జిల్లాలో చేపట్టిన అభివృద్ధి పనులను నవంబర్ నెలాఖరులోగా పూర్తి చేయాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించిన ఆయన పాఠశాలల మరమ్మతులు, సీసీ రోడ్లు, కమ్యూనిటీ హాళ్లు, అంగన్‌వాడీ కేంద్రాల పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. పనుల్లో జాప్యం లేకుండా పర్యవేక్షించాలని, నాణ్యతలో రాజీ పడవద్దని స్పష్టం చేశారు.

## పట్టణ అభివృద్ధికి అందరూ సహకరించాలి



**పెద్దపల్లి, సెప్టెంబర్ 15 (తెలంగాణ వాణి జిల్లా ప్రతినిధి):**
పెద్దపల్లి పట్టణ అభివృద్ధికి ప్రజలు, వ్యాపారులు సహకరించాలని రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు కోరారు. జెండా చౌరస్తా నుంచి మసీదు చౌరస్తా వరకు జరుగుతున్న రోడ్డు విస్తరణ, సుందరీకరణ పనులను ఆయన పరిశీలించారు. రోడ్డుకు ఇరువైపులా అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులు చేపడుతున్నామని, పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజలు, వ్యాపారుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని రోడ్డు వెడల్పును 55 అడుగులకు పరిమితం చేశామని తెలిపారు. నాణ్యతలో రాజీ లేకుండా పనులు పూర్తి చేస్తామని పేర్కొన్నారు.

## వరకట్న వేధింపుల ఆరోపణలతో గృహిణి ఆత్మహత్య



**గుండ్లపల్లి (డిండి), సెప్టెంబర్ 15 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
డిండి మండలం ములా తండా శివారులోని వ్యవసాయ బావిలో పడి టేకులపల్లి నాగమణి (21) మృతి చెందింది. సుమారు 18 నెలల క్రితం ఆంజనేయులుతో ప్రేమ వివాహం జరిగిన నాగమణికి వివాహ సమయంలో రూ.5 లక్షల నగదు, 6 తులాల బంగారం ఇచ్చినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. అదనపు కట్నం కోసం భర్త, అత్త, మామ, నాయనమ్మ వేధించారని ఆరోపించారు. ఈ విషయమై పెద్దల సమక్షంలో ఇటీవల ఇరువర్గాల మధ్య చర్చ జరిగినట్లు తెలిపారు. అనంతరం నాగమణి బావిలో పడి మృతి చెందింది. మృతురాలి తండ్రి అనిమోని వెంకటయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సీహెచ్ బాలకృష్ణ తెలిపారు.

## గణేష్ మండపంలో ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ ప్రత్యేక పూజలు



**పెద్దపల్లి, సెప్టెంబర్ 15 (తెలంగాణ వాణి జిల్లా ప్రతినిధి):**
అంతర్గాం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన గణేష్ మండపాన్ని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని గణనాథుడిని ప్రార్థించారు. ఈ సందర్భంగా మండప నిర్వాహకులు, డేర్ బాయ్స్ యూత్ సభ్యులు ఎమ్మెల్యేను శేషవస్త్రాలతో సత్కరించారు. గణేష్ ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, భక్తులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడిగా రెడ్డిగాని రాజు



**తిమ్మాపూర్, సెప్టెంబరు 15 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడిగా రెడ్డిగాని రాజు నియమితులయ్యారు. తిమ్మాపూర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మానకొండూర్ ఎమ్మెల్యే, టీపీసీసీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు డా. కవ్వంపల్లి సత్యనారాయణ ఆయనకు నియామక పత్రం అందజేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేయడంతో పాటు పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఎమ్మెల్యే సూచించారు. తన నియామకానికి సహకరించిన నాయకులకు రాజు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులే జాతి నిర్మాతలు: తహసీల్దార్ శ్రీనివాస్



**ధర్మారం, సెప్టెంబర్ 15 (తెలంగాణ వాణి):**
ధర్మారం మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో జక్కనపల్లిలోని సంస్కృతి బాంకెట్ హాల్‌లో మండల స్థాయి ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో సుమలత ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన 25 మంది ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించి అవార్డులు అందజేశారు. ఉపాధ్యాయులు విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దుతూ జాతి నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తున్నారని శ్రీనివాస్ అన్నారు. ఎఫ్ఎల్ఎన్ ఛాంపియన్లుగా 12 పాఠశాలలు ఎంపిక కావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎంఈవో పోతు ప్రభాకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. కందుకూరి భాస్కర్ వ్యాఖ్యాత వ్యవహారించిన ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యయుల మండల విద్యా వనరుల కేంద్రం సిబ్బంది, సిఆర్పిలు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## పూర్వ ప్రాథమిక విద్యను బలోపేతం చేయాలి

### కలెక్టర్ ప్రతిమా సింగ్



**రామాయంపేట, సెప్టెంబర్ 15 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
రామాయంపేట మండలం అక్కన్నపేటలోని ప్రీ ప్రైమరీ, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలను జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడి విద్యా ప్రమాణాలు, మౌలిక వసతులను పరిశీలించారు. పూర్వ ప్రాథమిక విద్యను బలోపేతం చేయడంతో పాటు ఎఫ్ఎల్ఎన్ లక్ష్యాలను సాధించాలని, మధ్యాహ్న భోజనం నాణ్యతతో అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆదేశించారు.

## గణేష్ నగర్ గణనాథునికి ప్రత్యేక పూజలు



**జగిత్యాల, సెప్టెంబర్ 15 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
: గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గణేష్ నగర్ సంక్షేమ మండలి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుని వద్ద నిత్య పూజలు, భోగాల కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా గణేష్ నగర్ సంక్షేమ మండలి గౌరవ అధ్యక్షులు చెన్నమనేని సంతోష్ రావు, అధ్యక్షులు ఎల్లాల రాజేశ్వర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి కమటాల రవీందర్ తోపాటు పాము సత్యనారాయణ, యాళ్ల అమర్‌నాథ్ రెడ్డి, యాచమనేని వెంకట రామారావు, ముదిగంటి సంతోష్ రెడ్డి, సంగని చంద్రశేఖర్, తాటిపర్తి అంజిరెడ్డి, ఎల్లబోయిన రమేష్ బాబు, పడకండి శ్రీనివాస చారి, పల్లెర్ల ప్రభాకర్, యాదగిరి రామారావు, ఎల్.జి. గార్డెన్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రేమ పేరుతో వేధింపులు.. యువతి ఆత్మహత్య



**పెద్దపల్లి, సెప్టెంబర్ 15 (తెలంగాణ వాణి జిల్లా ప్రతినిధి):**
ప్రేమ పేరుతో ఇద్దరు వ్యక్తులు వేధించడంతో తీవ్ర మనస్తాపానికి గురైన యువతి పురుగుల మందు సేవించి మృతి చెందిన ఘటన గోదావరిఖని లెనిన్‌నగర్‌లో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. లెనిన్‌నగర్‌కు చెందిన అక్షిత రాణి (20)ను గతంలో పాలిటెక్నిక్ కళాశాలలో లెక్చరర్‌గా పనిచేసిన జెట్టి నవీన్, అనంతరం ఆర్జీ-1 ఏరియాలోని 2-ఇంక్లైన్‌లో ఓవర్ మ్యాన్‌గా పనిచేస్తున్న బొమ్మకంటి రవికుమార్ ప్రేమ పేరుతో వేధించినట్లు ఆమె తండ్రి ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ క్రమంలో సెప్టెంబర్ 12న అక్షిత రాణి పురుగుల మందు సేవించగా కుటుంబ సభ్యులు గోదావరిఖని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సెప్టెంబర్ 13న మృతి చెందింది. తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, వేధింపుల ఆరోపణలపై దర్యాప్తు చేస్తున్నారు.

## 1.050 కిలోల గంజాయి పట్టివేత.. ఇద్దరు అరెస్ట్



**పెద్దపల్లి, సెప్టెంబర్ 15 (తెలంగాణ వాణి జిల్లా ప్రతినిధి)**
: గోదావరిఖని బస్టాండ్ అవుట్‌గేట్ వద్ద వాహనాల తనిఖీల్లో 1.050 కిలోల గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. గంజాయి తరలిస్తున్న ఇద్దరిని అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి సుమారు రూ.52,500 విలువైన గంజాయి, బ్యాగ్, మొబైల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం.. గోదావరిఖని-1 టౌన్ పోలీసులు మంగళవారం మధ్యాహ్నం వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా అనుమానాస్పదంగా కనిపించిన పిన్నోజి గోపి (24), మాచర్ల పవన్ కుమార్ (19)ను అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా గంజాయి లభించింది. మహారాష్ట్రలోని చంద్రపూర్ ప్రాంతంలో గంజాయి కొనుగోలు చేసి హైదరాబాద్‌కు తరలిస్తున్నట్లు విచారణలో వెల్లడైనట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## రవీందర్ కుటుంబానికి మంత్రి పొన్నం ప్రభాకర్ పరామర్శ



**చిగురుమామిడి, సెప్టెంబర్ 15 (తెలంగాణ వాణి విలేఖరి):**
కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ జిల్లా ఉపాధ్యక్షుడు గీకురు రవీందర్ కుటుంబాన్ని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పరామర్శించారు. రవీందర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన మంత్రి, కుటుంబ సభ్యులను ఓదార్చారు. కష్టకాలంలో అధైర్యపడవద్దని, కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ కుటుంబానికి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ చిగురుమామిడి మండల అధ్యక్షులు అందే సురేష్, సింగిల్ విండో చైర్మన్ చిట్టుమల్ల రవీందర్, మండల సర్పంచుల ఫోరం అధ్యక్షులు మర్కా రాజ్ కుమార్, డీసీసీ కార్యదర్శి సాంబారీ బాబు, మాజీ డీసీసీ అధికార ప్రతినిధి అయిరెడ్డి సత్యనారాయణ రెడ్డి, సీనియర్ నాయకులు వంగర మల్లేశం, సర్పంచులు ఆకవరం భవాని శివప్రసాద్, లక్ష్మి మురహరారెడ్డి, చింతపుల నరేందర్, డైరెక్టర్ లు పోటు మల్లారెడ్డి, బెజ్జంకి భాగ్య, మర్రి శ్రీనివాస్, సీనియర్ నాయకులు గజ్జెల రాములు, పుదరి వేణు, కూనచుల మహేందర్, వంగ కనకయ్య, పూల లచ్చిరెడ్డి, మాజీ ఎంపీటీసీ చీల లక్ష్మారెడ్డి, వడియాల రవీందర్ రెడ్డి, పచ్చిమట్ల జగన్, జిల్లాల భగవాన్ ప్రసాద్,బోయిని వంశీ కృష్ణ, దోబ్బల బాబు, చెల్పూరీ విష్ణుమ చారి,గుడిసె అర్జున్, పచ్చిమట్ల అజయ్, సిరవేణి సంపత్, గడ్డం అనిల్, కవ్వంపెల్లి సంజీవ్,దోమ తిరుపతి రెడ్డి,చెరుకు సమ్మయ్య, బాల కృష్ణ చారి తదితరులు పాల్గొన్నారు.

## నేడు మంత్రి పొన్నం చేతుల మీదుగా కమ్యూనిటీ కిచెన్ ప్రారంభం

### కరీంనగర్‌లో 49,025 మంది విద్యార్థులకు స్కూల్ బ్రేక్‌ఫాస్ట్



**కరీంనగర్, సెప్టెంబర్ 15 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
విద్యార్థుల ఆరోగ్యం, ఏకాగ్రత, హాజరు పెంపే లక్ష్యంగా ప్రభుత్వం చేపట్టిన స్కూల్ బ్రేక్‌ఫాస్ట్ కార్యక్రమం కరీంనగర్ జిల్లాలో నేటి నుంచి ప్రారంభం కానుంది. మార్కెట్ యార్డులో సుమారు రూ.8 కోట్లతో ఏర్పాటు చేసిన సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్‌ను మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించనున్నారు. ఈ కిచెన్ ద్వారా 17 మండలాల్లోని 669 ప్రభుత్వ పాఠశాలలు, 11 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుతున్న 49,025 మంది విద్యార్థులకు ప్రతిరోజూ అల్పాహారం అందించనున్నారు. ఇడ్లీ, పూరీ, దోశ, ఉప్మా, మిల్లెట్ ఇడ్లీ తదితర అల్పాహారంతో పాటు రోజు విడిచి రోజు పాలు అందించనున్నారు. కార్యక్రమాన్ని హరే కృష్ణ మూవ్‌మెంట్ చారిటబుల్ ఫౌండేషన్ అమలు చేయనుంది.

## జిల్లా పోలీసు కార్యాలయంలో ఘనంగా గణనాథునికి పూజలు



**సంగారెడ్డి, సెప్టెంబర్ 15 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
జిల్లా పోలీసు సాయుధ దళ కార్యాలయ ప్రాంగణంలో ప్రతిష్ఠించిన గణనాథునికి జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, ఐపీఎస్ దంపతులు, అదనపు ఎస్పీ చైతన్యరెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పుష్పాలు, పండ్లు సమర్పించి హారతి ఇచ్చారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లా ప్రజలు, పోలీసు అధికారులు, సిబ్బంది ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని గణనాథుని ప్రార్థించినట్లు తెలిపారు. ప్రజలందరూ వినాయక నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, సోదరభావంతో శాంతియుతంగా నిర్వహించుకోవాలని, పోలీసుశాఖకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలి

### కరీంనగర్‌లో బీజేపీ తిరంగా బైక్ ర్యాలీ



**కరీంనగర్ టౌన్, సెప్టెంబర్ 15 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
తెలంగాణ విమోచన దినోత్సవాన్ని పురస్కరించుకుని బీజేపీ ఆధ్వర్యంలో కరీంనగర్‌లో తిరంగా బైక్ ర్యాలీ నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశం ఆధ్వర్యంలో గీతాభవన్ నుంచి ప్రారంభమైన ర్యాలీ ప్రధాన వీధుల మీదుగా కలెక్టరేట్ వరకు సాగింది. అనంతరం అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సాయిని మల్లేశం మాట్లాడుతూ సెప్టెంబర్ 17ను 'ప్రజా పాలన దినోత్సవం'గా కాకుండా తెలంగాణ విమోచన దినోత్సవంగా ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్పొరేటర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఇందుర్తి ప్రాంతంలో ప్రజల కోసం ప్రాణాలర్పించింది కమ్యూనిస్టులే

### మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి

**చిగురుమామిడి, సెప్టెంబర్ 16 (తెలంగాణ వాణి విలేఖరి):**
తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో కమ్యూనిస్టులు చేసిన త్యాగాల ఫలితంగానే తెలంగాణ ప్రాంతానికి విముక్తి లభించిందని సీపీఐ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి అన్నారు. సాయుధ పోరాట చరిత్రను వక్రీకరిస్తే సీపీఐ చూస్తూ ఊరుకోదని స్పష్టం చేశారు. సెప్టెంబర్ 11 నుంచి 17 వరకు సీపీఐ నిర్వహిస్తున్న తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల్లో భాగంగా చిగురుమామిడి మండలంలోని ఇందుర్తి, గునుకులపల్లి, ఓగులాపూర్, గాగిరెడ్డిపల్లి, నవాబుపేట, చిగురుమామిడి, రేకొండ, బొమ్మనపల్లి గ్రామాల్లోని అమరవీరుల స్మారక స్థూపాల వద్ద చాడ వెంకటరెడ్డి, సీపీఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ వెట్టిచాకిరీ, బానిసత్వం, అణచివేతకు వ్యతిరేకంగా, భూమి, భుక్తి కోసం తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం సాగిందన్నారు. ఈ పోరాటంలో వేలాది మంది ప్రజలు పాల్గొన్నారని, ఎందరో కమ్యూనిస్టులు ప్రాణత్యాగం చేశారని గుర్తుచేశారు.



ఇందుర్తి ప్రాంతంలో ప్రజల కోసం కమ్యూనిస్టు నాయకులు చేసిన పోరాటాలు చరిత్రలో నిలిచిపోయాయని పేర్కొన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ మాట్లాడుతూ కరీంనగర్ జిల్లాలో బద్దం ఎల్లారెడ్డి, అనభేరి ప్రభాకర్‌రావు తదితరులు సాయుధ పోరాటంలో కీలక పాత్ర పోషించారని తెలిపారు. వారి ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర, జిల్లా, మండల నాయకులు, కార్యకర్తలు, అమరవీరుల కుటుంబాల వారసులు తదితరులు పాల్గొన్నారు.

## చెత్త బండ్ల నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

### మున్సిపల్ చైర్మన్‌కు కౌన్సిలర్ శ్రీపతి స్వర్ణలత నరేష్ వినతి

**జమ్మికుంట, సెప్టెంబర్ 15 (తెలంగాణ వాణి ప్రతినిధి)**



జమ్మికుంట పట్టణంలో చెత్త సేకరణ వాహనాల నిర్వహణపై మున్సిపల్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆరో వార్డు కౌన్సిలర్ శ్రీపతి స్వర్ణలత నరేష్ కోరారు. ఈ మేరకు మున్సిపల్ చైర్మన్‌కు వినతిపత్రం అందజేశారు. పట్టణంలో 23 చెత్త సేకరణ వాహనాలు ఉండగా ప్రస్తుతం సుమారు 12 మాత్రమే నడుస్తున్నాయని తెలిపారు. నిలిచిపోయిన వాహనాలకు వెంటనే సర్వీసింగ్, మరమ్మతులు చేపట్టి అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. పారిశుధ్యం, ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని విజ్ఞప్తి చేశారు.

## సిద్ధి వినాయక ఆలయంలో ఎమ్మెల్యే జీఎంఆర్ ప్రత్యేక పూజలు



**పటాన్‌చెరు, సెప్టెంబర్ 15 (తెలంగాణ వాణి):**
వినాయక చవితి సందర్భంగా ఇస్నాపూర్ మున్సిపల్ పరిధిలోని రుద్రారం గణేష్‌గడ్డ శ్రీ సిద్ధి వినాయక దేవాలయాన్ని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. నియోజకవర్గ ప్రజలు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని స్వామివారిని ప్రార్థించారు. ఆలయ కమిటీ, ప్రజాప్రతినిధులు ఎమ్మెల్యేకు స్వాగతం పలకగా, వేద పండితులు ఆశీర్వచనం అందించారు. అనంతరం ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు.

## మేధో క్షయంపై గీతంలో చర్చాగోష్ఠి

### వక్తలుగా పాల్గొన్న డాక్టర్ రథిన్ రాయ్, డాక్టర్ సుప్రీ రంజన్, సుర్వేష్ ప్రతాప్ సింగ్



**పటాన్ చెరు, సెప్టెంబర్ 15, (తెలంగాణ వాణి)**
'మేధో క్షయం రాజకీయాలను కలిసినప్పుడు: బొద్దింక జనతా పార్టీ కథ' అనే అంశంపై గీతం స్కూల్ ఆఫ్ హ్యుమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ (జీఎస్ హెచ్‌ఎస్), హైదరాబాదులోని రాజనీతి శాస్త్ర విభాగం సెప్టెంబరు 15న ఆలోచన రేకెత్తించే చర్చా గోష్ఠిని నిర్వహించింది. ప్రముఖ ఆర్థికవేత్త, జీఎస్ హెచ్‌ఎస్ డీన్ అయిన డాక్టర్ రథిన్ రాయ్ తో పాటు, రాజనీతి శాస్త్ర విభాగంలోని అధ్యాపకులైన డాక్టర్ సుప్రీ రంజన్, సుర్వేష్ ప్రతాప్ సింగ్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. యువ తరాలలో మారుతున్న రాజకీయ ఆకాంక్షలు, ఆర్థిక చైతన్యం, సామాజిక ఐక్యత, సాంకేతిక పరివర్తన, నిరసన ఉద్యమాలు, యువత-రాజకీయాల మధ్య అభివృద్ధి చెందుతున్న సంబంధం వంటి అంశాలను వక్తలు విశ్లేషించారు. డాక్టర్ రాయ్, శ్రేయస్సు, అసమానతల యొక్క మారుతున్న నమూనాలపై తన అభిప్రాయాలను పంచుకుంటూ, అభివృద్ధి చెందుతున్న రాజకీయ ఉద్యమాలను తీర్చిదిద్దడంలో ప్రతిఘటన, వీధి రాజకీయాలు, సాంకేతికత, యువత ఆకాంక్షల పాత్రను ప్రముఖంగా ప్రస్తావించారు. డాక్టర్ సుప్రీ రంజన్ భారతదేశంలో, ముఖ్యంగా సరళీకరణ అనంతర కాలంలో యువజన ఉద్యమాల పరివర్తన గురించి, అలాగే ప్రతిభ, పరీక్షా పత్రాల లీకులు, వ్యవస్థాగత అసమానతలు వంటి సమస్యల వల్ల ఎదురయ్యే సవాళ్ల గురించి చర్చించారు. సుర్వేష్ ప్రతాప్ సింగ్ సాంస్కృతిక పునరుత్థానం, ఆర్థిక చైతన్యం, ప్రజా ప్రదేశాలు, వీధి స్థాయి భాగస్వామ్యంలో వేళ్లూనుకున్న ఒక ప్రక్రియగా ప్రజాస్వామ్యం అనే భావనపై మాట్లాడారు. విద్యార్థులు, అధ్యాపకులు అడిగిన పలు సందేహాలకు తగ్గ జవాబు లిచ్చి వక్తలు ఆకట్టుకున్నారు. డాక్టర్ మయాంక్ మిశ్రా వందన సమర్పణతో ఈ కార్యక్రమం ముగిసింది.

## బీరంగూడలో వినాయక మండపాలను సందర్శించిన విద్యుత్ శాఖ అధికారులు



**పటాన్‌చెరు, సెప్టెంబర్ 15 (తెలంగాణ వాణి):**
బీరంగూడ డివిజన్‌లో ఏర్పాటు చేసిన వినాయక మండపాలను విద్యుత్ శాఖ చీఫ్ ఇంజినీర్ రమేష్, ఎస్‌ఈ సుధీర్, డీఈ భాస్కర్, ఏడీఈ సంజీవ్ సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమీన్‌పూర్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నందారం నరసింహ గౌడ్ ఆధ్వర్యంలో అధికారులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ మండపాల వద్ద విద్యుత్ భద్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. నాణ్యమైన వైరింగ్, సరైన ఇన్సులేషన్ వినియోగించాలని, లూజ్ కనెక్షన్లు, బహిరంగంగా ఉన్న వైర్లతో ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో విద్యుత్ అధికారులు, ప్రజాప్రతినిధులు, ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

## గీతంలో ఇంజనీర్ల దినోత్సవ వేడుకలు



**పటాన్ చెరు, సెప్టెంబర్ 15, (తెలంగాణ వాణి)**
హైదరాబాదులోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో సెప్టెంబరు 15న మినీ హ్యాకథాన్, ఆటలు, ఆసక్తికరమైన కార్యక్రమాలతో ఇంజనీర్ల దినోత్సవం 2026ను ఘనంగా జరుపుకున్నారు. ఈ వేడుకలలో వివిధ విభాగాల ఇంజనీరింగ్ విద్యార్థులు చురుకుగా పాల్గొన్నారు. భారత దేశపు అత్యంత ప్రసిద్ధ ఇంజనీర్లలో ఒకరు; నీటిపారుదల, నీటి నిర్వహణ, మౌలిక సదుపాయాలు, పారిశ్రామిక అభివృద్ధి రంగాలలో మార్గదర్శకుడైన సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకుని ప్రతి యేటా సెప్టెంబరు 15న ఇంజనీర్ల దినోత్సవాన్ని పాటిస్తారు. ఈ సందర్భంగా, గీతం నాయకత్వం ఆయన చిత్రపటానికి ఘన నివాళులర్పించింది. ఆవిష్కరణలు, సాంకేతికత, సుస్థిర పరిష్కారాల ద్వారా వాస్తవ ప్రపంచ సవాళ్లను పరిష్కరించడంలో ఇంజనీర్ల కీలక పాత్రను ఈ వేడుకలు చాటి చెప్పాయి. ఆవిష్కరణలను సుస్థిరతతో, సాంకేతికతను మానవత్వంతో, నైపుణ్యాన్ని సామాజిక బాధ్యతతో మేలవించే బాధ్యతాయుతమైన ఇంజనీర్లుగా ఎదిగి, సర్ ఎం. విశ్వేశ్వరయ్య వారసత్వాన్ని ముందుకు తీసుకు వెళ్లాలని ఈ కార్యక్రమం విద్యార్థులను ప్రోత్సహించింది. మరింత వినూత్నమైన, సుస్థిరమైన, స్థితిస్థాపకమైన, సమ్మిళిత భారతదేశానికి దోహదపడే పరిష్కారాలను సృష్టించడం కొనసాగించాలని యువ ఇంజనీర్లకు సందేశంతో ఈ కార్యక్రమం ముగిసింది.

## గణేష్ మండపాలను తనిఖీ చేసిన పోలీసులు



**వీణవంక, సెప్టెంబర్ 15 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
వినాయక చవితి సందర్భంగా వీణవంక మండలంలోని పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన గణేష్ మండపాలను జమ్మికుంట రూరల్ సీఐ పులి వెంకట్, ఎస్‌ఐ ఆవుల తిరుపతి తనిఖీ చేశారు. వీణవంక, కోర్కల్, రెడ్డిపల్లి, చల్లూరు గ్రామాల్లో మండపాలను పరిశీలించి నిర్వాహకులకు భద్రతా సూచనలు చేశారు. ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహిస్తూ, నిమజ్జన కార్యక్రమాన్ని పోలీసుల సూచనల మేరకు చేపట్టాలని కోరారు. ప్రజలు, నిర్వాహకులు పోలీసులకు సహకరించాలని సూచించారు.

## గ్రామాల అభివృద్ధికి నిరంతర కృషి: ఎమ్మెల్యే సంజీవరెడ్డి



**పెద్దశంకరంపేట, సెప్టెంబర్ 15 (తెలంగాణ వాణి):**
గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని నారాయణఖేడ్ ఎమ్మెల్యే డా. పట్లోళ్ల సంజీవరెడ్డి తెలిపారు. పెద్దశంకరంపేట మండలం జమున నాయక్ తండాలో ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు రూ.20 లక్షలతో నిర్మించనున్న గ్రామ పంచాయతీ భవనానికి ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమాల్లో పాల్గొని లబ్ధిదారులను అభినందించారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## సాంకేతికతతోనే ఉజ్వల భవిష్యత్తు

**తిమ్మాపూర్, సెప్టెంబరు 15 (తెలంగాణ వాణి ప్రతినిధి):**



తిమ్మాపూర్ మండలంలోని వాగేశ్వరి కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్‌లో సర్ ఎం. విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకుని ఇంజినీర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కళాశాల జనరల్ సెక్రెటరీ డా. గంద్ర శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. దేశ అభివృద్ధిలో ఇంజినీర్ల పాత్ర కీలకమని, సృజనాత్మక ఆలోచనలతో ముందుకు సాగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల జాయింట్ సెక్రెటరీ డాక్టర్ డి. శ్రీనివాస్‌రెడ్డి, సొసైటీ సభ్యులు వి. వినోద్, సి.హెచ్. ప్రకాష్‌రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ సి.హెచ్. శ్రీనివాస్, ఫస్ట్ ఇయర్ అకాడమిక్ ఇన్‌చార్జి డాక్టర్ జె. సంధ్య, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## గణేష్ నిమజ్జనంలో నిబంధనలు పాటించాలి



**వీణవంక, సెప్టెంబర్ 15 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
గణేష్ నిమజ్జనం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా వీణవంక పోలీసులు డీజే నిర్వాహకులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. నిమజ్జనాన్ని ప్రశాంత వాతావరణంలో నిర్వహిస్తూ పోలీసుల సూచనలు, నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ఎస్‌ఐ ఆవుల తిరుపతి సూచించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు, నిర్వాహకులు పోలీసులకు సహకరించాలని కోరారు.

## ఉత్తమ ఉపాధ్యాయులకు ఘన సన్మానం



**కొమురవెల్లి, సెప్టెంబర్ 15 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మండలం రాంసాగర్ ప్రాథమిక పాఠశాలలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కొంక నరేష్‌తో పాటు విద్యాబోధనలో ప్రతిభ కనబరుస్తున్న ఉపాధ్యాయురాలు మంగను ఏఏపీసీ చైర్మన్, విద్యార్థుల తల్లిదండ్రులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు, పాఠశాల సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

## మారుమూల గ్రామ విద్యార్థులకు ధర్మధారా ట్రస్ట్ అండ

### స్కూల్ బ్యాగ్స్, స్టేషనరీ పంపిణీ






**లక్ష్మీదేవిపల్లి, సెప్టెంబర్ 15 (తెలంగాణ వాణి)**
లక్ష్మీదేవిపల్లి మండలంలోని మారుమూల గ్రామమైన గడ్డిగుట్ట జీపీఎస్ పాఠశాల విద్యార్థులకు రూప్లా నాయక్ అధ్యక్షతన, బటర్ఫ్లై చారిటబుల్ ట్రస్ట్ వారి ఆధ్వర్యంలో ధర్మాదార చారిటబుల్ ట్రస్ట్ వారి ఆర్థిక సహకారంతో స్కూల్ బ్యాగ్స్, స్టేషనరీ సామగ్రిని పంపిణీ చేశారు. గ్రామ సర్పంచ్ సంతోష్ నాయక్, కాంప్లెక్స్ హెచ్ఎం బి శంకర్ చేతుల మీదుగా 30 మంది విద్యార్థులకు బ్యాగ్స్‌తో పాటు విద్యా సంవత్సరానికి అవసరమైన నోట్‌బుక్స్, ఇతర స్టేషనరీ వస్తువులను అందజేశారు. విద్యార్థుల్లో చదువుపై ఆసక్తిని పెంపొందించడంతో పాటు, పేద విద్యార్థులకు అండగా నిలవాలనే ఉద్దేశంతో ధర్మధారా చారిటబుల్ ట్రస్ట్ ఈ కార్యక్రమాన్ని చేపట్టి, మారుమూల ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అవసరమైన విద్యా సామగ్రిని అందించడం అభినందనీయమని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, తల్లిదండ్రులు ధర్మధారా చారిటబుల్ ట్రస్ట్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి భవిష్యత్తులోనూ ఇలాంటి సేవా కార్యక్రమాలను కొనసాగించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ధర్మధారా చారిటబుల్ ట్రస్ట్ కో–ఆర్డినేటర్ రూప్లా నాయక్ ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ ఎస్సిఆర్పి బి. రమేష్, పంచాయతీ సెక్రెటరీ శ్రీజ, జిపిఎస్ గడ్డిగుట్ట పాఠశాల ఉపాధ్యాయులు బేబీరాణి, రమకుమారి, సేవాలాల్ సేన రాష్ట్ర నాయకులు లావుడ్యా ప్రసాద్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటి సభ్యులు, విద్యార్థిని విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు, గ్రామ యువత పాల్గొన్నారు.

## పీసీసీ అధ్యక్షుడికి ఎమ్మెల్యే వంశీకృష్ణ సన్మానం

**అచ్చంపేట, సెప్టెంబర్ 15 (తెలంగాణ వాణి న్యూస్ ఆప్ ప్రతినిధి):**



టీపీసీసీ అధ్యక్షుడిగా మహేష్‌కుమార్ గౌడ్ రెండేళ్లు విజయవంతంగా పూర్తి చేసుకున్న సందర్భంగా టీపీసీసీ ఉపాధ్యక్షుడు, డీసీసీ అధ్యక్షుడు, అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ ఆయనను ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి, కార్యకర్తలకు అండగా నిలవడంలో మహేష్‌కుమార్ గౌడ్ నాయకత్వం స్ఫూర్తిదాయకమన్నారు. ఆయన నాయకత్వంలో పార్టీ మరింత బలోపేతమై ముందుకు సాగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

## గణపతి వేడుకల్లో కాసాని పద్మ, డా. ఉదయ జ్యోతి



**అశ్వారావుపేట, సెప్టెంబర్ 15 (తెలంగాణ వాణి)**
అశ్వారావుపేట మండలంలో భగత్‌సింగ్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గణపతి నవరాత్రి ఉత్సవాల్లో కాసాని నాగశేష పద్మ, కౌన్సిలర్ డా. ఉదయ జ్యోతి పాల్గొని గణనాథుడికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నూతన దంపతులకు వస్త్రాలను కానుకగా అందజేసి, వారి దాంపత్య జీవితం సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో సాగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉత్సవ నిర్వాహకులు, భక్తులు, స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.ఖ

## ప్రజల ఆరోగ్యమే లక్ష్యం

### ఉచిత కంటి ఆపరేషన్లకు సర్పంచ్ లావుడ్య పూర్ణ చేయూత



**కొత్తగూడెం, సెప్టెంబర్ 15 (తెలంగాణ వాణి)**
లక్ష్మీదేవిపల్లి, రేగళ్ల పెద్దతండా, గ్రామ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో సర్పంచ్ లావుడ్య పూర్ణ ఆధ్వర్యంలో ఈ నెల 8న నిర్వహించిన ఉచిత మెగా హెల్త్ క్యాంప్‌కు విశేష స్పందన లభించింది. శిబిరంలో వివిధ ఆరోగ్య సమస్యలకు వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులు, వైద్యుల సూచనలు అందించారు. కంటి సమస్యలతో బాధపడుతున్న వారిని గుర్తించి ఉచిత కంటి ఆపరేషన్లకు పంపిస్తున్నారు. ఈ నెల 10న ఆరుగురిని ఆసుపత్రికి పంపించి విజయవంతంగా ఆపరేషన్లు చేయించగా, మంగళవారం మరో 10 మందిని సర్పంచ్ లావుడ్య పూర్ణ దగ్గరుండి ఆసుపత్రికి పంపించారు. వారికి రవాణా, భోజనం, వసతి తదితర సౌకర్యాలను ఉచితంగా కల్పిస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ప్రతి సంవత్సరం ఉచిత మెగా వైద్య శిబిరాలు నిర్వహించడంతో పాటు, అవసరమైన వారికి ఉచిత కంటి ఆపరేషన్లు చేయిస్తామని సర్పంచ్ పూర్ణ తెలిపారు. గ్రామ ప్రజల ఆరోగ్యం కోసం నిరంతరం సేవ చేస్తానని పేర్కొన్నారు.

# రైతులకు ప్రకృతి వ్యవసాయ కిట్ల పంపిణీ



**ములకలపల్లి, సెప్టెంబర్ 15 (తెలంగాణ వాణి):**
రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా జాతీయ ప్రకృతి వ్యవసాయ మిషన్ ఆధ్వర్యంలో ములకలపల్లి రైతు వేదికలో రైతులకు ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ ఇచ్చి, కిట్లను పంపిణీ చేశారు. ములకమామిడి గ్రామాన్ని ప్రకృతి వ్యవసాయ క్లస్టర్‌గా గుర్తించగా, 125 మంది రైతులు 125 ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం చేస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి అరుణ్‌బాబు తెలిపారు.



మూకమామిడి సర్పంచ్ కోర్స ఆదిలక్ష్మి, తిమ్మంపేట సర్పంచ్ తుర్రం శ్రీను చేతుల మీదుగా 125 మంది రైతులకు ప్రకృతి వ్యవసాయ కిట్లను అందజేశారు. రసాయన ఎరువులు, పురుగుమందుల వినియోగాన్ని తగ్గించి నేల సారాన్ని, రైతుల ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని వారు సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు రాహుల్, సూరిబాబు, రైతులు పాల్గొన్నారు.

# పేరాయిగూడెంలో ఆధ్యాత్మిక శోభ

### ప్రత్యేక పూజలతో గణపయ్యకు భక్తుల ఆరాధన

**అశ్వారావుపేట, సెప్టెంబర్ 15 (తెలంగాణ వాణి)**
అశ్వారావుపేట మండలం పేరాయిగూడెంలో అరుంధతి గణేష్ యూత్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వినాయక చవితి ఉత్సవాలు భక్తిశ్రద్ధల మధ్య కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా గణనాథుడికి ప్రత్యేక పూజలు, అర్చనలు, హారతులు నిర్వహించి గ్రామాభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం ప్రార్థనలు చేశారు. జుజ్జురపు శ్రీరామ్మూర్తి--మంగతాయారు దంపతులు, కాసాని చంద్రమోహన్--నాగశేష పద్మ దంపతులు, కౌన్సిలర్ డా. ఉదయజ్యోతి తదితరులు గణపయ్యను దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టౌన్ అధ్యక్షులు సత్యవరపు సంపూర్ణ, గుడవర్తి వెంకటేశ్వర్లు, మొటూరి మోహన్, పాలవలస జీవన్‌రావు,



తగరం హరి, గ్రామ పెద్దలు, ఉత్సవ కమిటీ సభ్యులు, యువత, మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. గణపయ్య దర్శనం కోసం భక్తులు తరలిరావడంతో గ్రామంలో పండుగ సందడి నెలకొంది.



## గణనాథుని దర్శించుకున్న తాటి వెంకటేశ్వర్లు

**ములకలపల్లి, సెప్టెంబర్ 15 (తెలంగాణ వాణి):**
మండలంలోని జగన్నాథపురం గ్రామంలో పీవీఆర్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వినాయక నవరాత్రి వేడుకల్లో అశ్వారావుపేట మాజీ ఎమ్మెల్యే, తెలంగాణ రాష్ట్ర తొలి ట్రైకార్ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు తాటి వెంకటేశ్వర్లు పాల్గొని గణనాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. నవరాత్రి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్న పీవీఆర్ యూత్ సభ్యులను అభినందించారు. ఈ సందర్భంగా పీవీఆర్ యూత్ సభ్యులు తాటి వెంకటేశ్వర్లును శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పామర్తి వెంకటేశ్వరరావు, శంకర్, దేవినాథ్, పామర్తి గోపి, మహమ్మద్ ముష్లిఫ్, ఖాదర్, ప్రశాంత్, అజయ్, యాసిన్, సమీర్ తదితరులు పాల్గొన్నారు.

## కోర్టుకు వాటర్ కూలర్ విరాళంగా అందించిన ఎస్‌బీఐ

**కొత్తగూడెం, సెప్టెంబర్ 15 (తెలంగాణ వాణి):**



స్థానిక కోర్టుకు వచ్చే కక్షిదారుల సౌకర్యార్థం ఎస్‌బీఐ కొత్తగూడెం శాఖ ఆధ్వర్యంలో వాటర్ కూలింగ్ ఫ్రిజ్‌ను విరాళంగా అందించారు. కోర్టు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఈ వాటర్ కూలర్ ద్వారా కక్షిదారులకు రక్షిత తాగునీరు అందుబాటులో ఉండనుంది. ఈ సందర్భంగా న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు ఎం. కిరణ్ కుమార్ మాట్లాడుతూ.. కక్షిదారులు బయట డబ్బులు వెచ్చించి వాటర్ బాటిళ్లు కొనుగోలు చేయాల్సిన అవసరం లేకుండా కోర్టులోనే తాగునీరు అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బీఐ బ్యాంకు అధికారులు, న్యాయవాది ఆర్. రామారావు తదితరులు పాల్గొన్నారు.

## కాంట్రాక్ట్ కార్మికులపై అధికారుల ఒత్తిడి తగదు



**కొత్తగూడెం సింగరేణి, సెప్టెంబర్ 15 (తెలంగాణ వాణి):**
సింగరేణి కొత్తగూడెం ఏరియా, కార్పొరేట్‌లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులపై పనిభారం, అధికారుల ఒత్తిడి తగ్గించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి భూక్య రమేష్ డిమాండ్ చేశారు. మంగళవారం సీఐటీయూ అనుబంధ సింగరేణి కాంట్రాక్ట్ కార్మిక సంఘం ఆధ్వర్యంలో పలు పని ప్రాంతాల్లో నిర్వహించిన సమావేశాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. స్వీపింగ్, స్కావెంజింగ్ విభాగాల కార్మికులు తమ సమస్యలను నాయకుల దృష్టికి తీసుకువచ్చారు. పని సమయంలో అలసటతో కొద్దిసేపు కూర్చున్నా, చిన్న తప్పులు జరిగినా ఆబ్సెంట్ వేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులను బానిసల్లా చూసే విధానం మార్చాలని, సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమించాల్సి వస్తుందని భూక్య రమేష్ హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ పట్టణ కమిటీ సభ్యుడు పప్పుల ప్రమోద్, సింగరేణి కాంట్రాక్ట్ కార్మిక సంఘం ఏరియా కార్యదర్శి పిచ్చెట్టి శివ, కార్మికులు పాల్గొన్నారు.

## అన్ని కార్మిక సంఘాలకు సమాన హోదా కల్పించాలి

### టీబీజీకేఎస్ డిమాండ్



**కొత్తగూడెం సింగరేణి, సెప్టెంబర్ 15 (తెలంగాణ వాణి):**
సింగరేణిలో గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల కాలపరిమితి సెప్టెంబర్ 8తో ముగిసిన నేపథ్యంలో ఎన్నికలు జరిగే వరకు అన్ని కార్మిక సంఘాలకు సమాన హోదా కల్పించాలని టీబీజీకేఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు పీవీకే–5 మైన్, వీకే ఓసీ మేనేజర్లు, హెచ్‌ఓడీలకు వినతి పత్రాలు అందజేశారు. టీబీజీకేఎస్ స్టేట్ చీఫ్ జనరల్ సెక్రటరీ కాపు కృష్ణ, సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ కూసాని వీరభద్రం మాట్లాడుతూ.. మైన్లు, డిపార్ట్‌మెంట్లలో జరిగే అన్ని కమిటీ సమావేశాల్లో అన్ని కార్మిక సంఘాలకు సమాన ప్రాతినిధ్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఏరియా ఉపాధ్యక్షులు గడప రాజయ్య, గిన్నరపు మహేందర్, కాగితపు విజయ్‌కుమార్, బూర్గుల రవికుమార్, తిరుపతి, రాజ్‌కుమార్, నమిల్ల వెంకటేశ్వర్లు, గోల్కొండ నవీన్, వినీత్, ఆలిం, అనుదీప్ తదితరులు పాల్గొన్నారు.

## హమారా ప్రసాద్‌ను అరెస్ట్ చేయాలి

### జేబీపీ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ యెర్రా కామేష్



**కొత్తగూడెం, సెప్టెంబర్ 15 (తెలంగాణ వాణి):**
అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని ఆరోపిస్తూ హమారా ప్రసాద్‌ను తక్షణమే అరెస్ట్ చేసి కేసు నమోదు చేయాలని జైభీమ్ రావ్ భారత్ పార్టీ (జేబీపీ) స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ యెర్రా కామేష్ డిమాండ్ చేశారు. మంగళవారం పార్టీ శ్రేణులతో కలిసి బస్టాండ్‌లోని తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద కండ్లకు గంతలు కట్టుకుని ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కామేష్ మాట్లాడుతూ.. అంబేద్కర్‌పై అభ్యంతరకర వ్యాఖ్యలు చేస్తున్నప్పటికీ ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడం సరికాదన్నారు. ఈ నెల 18న విడుదల చేయనున్నట్లు ప్రకటించిన 'కల్పిత నాయకుడు' పుస్తక ఆవిష్కరణను అడ్డుకోవాలని డిమాండ్ చేశారు. హమారా ప్రసాద్‌ను రాష్ట్ర బహిష్కరణ చేసి శాంతిభద్రతలు కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మాలోత్ వీరు నాయక్ ,అసెంబ్లీ అధ్యక్షుడు నాగుల రవికుమార్,మున్నా,కిరణ్,శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ ఇసుక రవాణాపై ఎస్ఐ యయాతి రాజు ఉక్కుపాదం

### జగన్నాథపురం వాగులో నాలుగు ట్రాక్టర్లు స్వాధీనం కేసు నమోదు

**అశ్వారావుపేట సెప్టెంబర్ 15 (తెలంగాణ వాణి)**



అశ్వారావుపేట మండలం జగన్నాథపురం గ్రామ శివారులోని వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను పోలీసులు పట్టుకుని స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టి నట్లు ఎస్ఐ యయాతి రాజు తెలిపారు. అక్రమ ఇసుక తవ్వకాలు, రవాణాపై ప్రత్యేక నిఘా కొనసాగిస్తున్నామని, ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుక తరలించే వారిపై కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించా రు. ప్రజలు తమ పరిసరాల్లో జరుగుతున్న అక్రమ కార్యకలా పాలపై పోలీసులకు సమాచారం అందించి సహకరించాలని కోరారు.



## పాఠశాలల్లో డీఈఓ తనిఖీ

**టేకులపల్లి, సెప్టెంబర్ 15 (తెలంగాణ వాణి):**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా విద్యాశాఖ అధికారి వాసంతి మంగళవారం టేకులపల్లి మండలంలోని ఎంపీపీఎస్ టేకులపల్లి, ఎంపీపీఎస్ వెంకటయ్యతండా పాఠశాలలను తనిఖీ చేశారు. తరగతి గది బోధనను పరిశీలించి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. పాఠశాల రికార్డులను తనిఖీ చేసి, వాటిని సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. వెంకటయ్య తండా పాఠశాలలో ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎం ఏ. వెంకట్రావు బోధనను పరిశీలించిన డీఈఓ సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏఎంఓ టి. మాధవరావు, సెంట్రల్ స్క్వేర్ ఫౌండేషన్ సభ్యులు అల్లూరి రెడ్డి, టేకులపల్లి ఉన్నత పాఠశాల కాంప్లెక్స్ హెచ్‌ఎం (ఎఫ్‌ఏసీ) ఎం. మోహన్‌రావు పాల్గొన్నారు.

## రోడ్డు స్థలంలో పిల్లర్ల నిర్మాణం అడ్డుకున్న అధికారులు



**అచ్చంపేట, సెప్టెంబర్ 15 (తెలంగాణ వాణి న్యూస్ ప్రతినిధి):**
అచ్చంపేట పట్టణంలోని ఉప్పునుంతల రోడ్డులో రోడ్డు స్థలాన్ని ఆక్రమించి చేపడుతున్న నిర్మాణాన్ని మున్సిపల్ టౌన్‌ప్లానింగ్ అధికారులు అడ్డుకున్నారు. రోడ్డు స్థలంలో పిల్లర్ల నిర్మాణం కోసం గుంతలు తవ్వుతున్నట్లు గుర్తించిన అధికారులు పనులను నిలిపివేయాలని భూ యజమాని వర్కాల శ్రీనివాసులను హెచ్చరించారు. అయితే నిర్మాణాన్ని తొలగించేందుకు అధికారులు జేసీబీతో చేరుకోగా యజమాని, కుటుంబ సభ్యులు ప్రతిఘటించడంతో ఉద్రిక్తత నెలకొంది. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. నిర్మాణం తొలగించేందుకు అధికారులు ప్రయత్నించగా, యజమాని గడువు కోరడంతో రెండు రోజుల సమయం ఇచ్చారు. గడువులోగా అక్రమంగా ఏర్పాటు చేసిన పిల్లర్లను తొలగించకపోతే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని టౌన్‌ప్లానింగ్ అధికారి మనోజ స్పష్టం చేశారు.

## ట్రాన్స్‌ఫార్మర్ కాపర్ వైరు చోరీ కేసు ఛేదన

### ముగ్గురు నిందితుల అరెస్ట్.. 178.5 కిలోల కాపర్ వైరు స్వాధీనం



**టేకులపల్లి, సెప్టెంబర్ 15 (తెలంగాణ వాణి):**
వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి కాపర్ వైరు చోరీ చేస్తున్న ముగ్గురు నిందితులను టేకులపల్లి పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి 178.5 కిలోల కాపర్ వైరు (విలువ సుమారు రూ.3.57 లక్షలు) స్వాధీనం చేసుకున్నారు. సీఐ బి. సత్యనారాయణ పర్యవేక్షణలో ఎస్ఐ కె. తిరుపతి, సిబ్బంది మంగళవారం సమ్మక్క--సారక్క గద్దెల వద్ద వాహన తనిఖీలు చేపట్టారు. అనుమానాస్పదంగా వచ్చిన ఆటోను తనిఖీ చేయగా నిందితులు పల్లపు వెంకటేష్ (35), రౌతు రమేష్ (34), వేముల సంతోష్ (34) పట్టుబడ్డారు. టేకులపల్లి మండలంలోని పలు ప్రాంతాలతో పాటు కొత్తగూడెం సింగరేణి పరిధిలో కాపర్ వైరు చోరీ చేసినట్లు నిందితులు అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు. చోరీకి ఉపయోగించిన ఆటోను కూడా స్వాధీనం చేసుకున్నారు. పరారీలో ఉన్న సాయిరాం, బాబును త్వరలో అరెస్ట్ చేస్తామని పోలీసులు తెలిపారు. కేసు ఛేదనలో ప్రతిభ కనబరిచిన సీఐ బి. సత్యనారాయణ, ఎస్ఐ కె. తిరుపతి, ఏఎస్ఐ బి. నరసింహరావు, పోలీసు సిబ్బందిని డీఎస్పీ యు. వెంకన్నబాబు అభినందించారు.

## హమారా ప్రసాద్‌ను అరెస్ట్ చేయాలని వినతి




**అచ్చంపేట, సెప్టెంబర్ 14 (తెలంగాణ వాణి న్యూస్ ప్రతినిధి)**
భారత రాజ్యాంగాన్ని కించపరిచేలా, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆశయాలకు విరుద్ధంగా అనుచిత వ్యాఖ్యలు చేసిన హమారా ప్రసాద్‌పై కేసు నమోదు చేసి వెంటనే అరెస్ట్ చేయాలని అంబేద్కర్ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బల్మూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు అందజేశారు. కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం జిల్లా అధ్యక్షుడు స్వామి, మండల అధ్యక్షుడు శ్రావణ్ కుమార్, కొండారెడ్డిపల్లి సర్పంచ్ రాధాకృష్ణ, బాణాల సర్పంచ్ దేశ్యా నాయక్, మైలారం మాజీ సర్పంచ్ శ్రీను, గణేష్, కొండల్, కొండానాగుల స్వామి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.



# హిట్ వచ్చింది కానీ.. ఆఫర్స్ మాత్రం లేవు..

## గ్లామర్ బ్యూటీ కేతిక శర్మ పరిస్థితి

**హైదరాబాద్:** కెరీర్ ప్రారంభించిన నాలుగేళ్ల తర్వాత తొలి హిట్ ముఖం చూసిన గ్లామర్ బ్యూటీ కేతిక శర్మకు, విజయం సాధించినా అవకాశాలు మాత్రం తలుపు తట్టడం లేదు. ఆకాష్ పూరి సరసన 'రొమాంటిక్' సినిమాతో టాలీవుడ్ ఎంట్రీ ఇచ్చిన ఈ భామ, ఆ తర్వాత వరుస ఫ్లాపులను ఎదుర్కొంది. మెగా హీరోలు సాయి ధరమ్ తేజ్ ('బ్రో'), వైష్ణవ్ తేజ్ ('రంగ రంగ వైభవంగా')లతో సినిమాలు చేసినప్పటికీ ఆమె ఫేట్ మారలేదు. ఫలితంగా కొంతకాలం సినిమాలకు దూరంగా ఉండాల్సి వచ్చింది. ఆ గ్యాప్ తర్వాత హీరో శ్రీవిష్ణు సరసన నటించిన 'సింగిల్' సినిమా గతేడాది సమ్మర్‌లో విడుదలై కేతిక కెరీర్‌లో తొలి విజయాన్ని అందించింది. ఫ్లాపుల్లో ఉన్నప్పుడు వచ్చిన ఆఫర్లు, హిట్ వచ్చాక రాకపోవడంతో కేతిక తీవ్ర నిరాశకు గురవుతోంది. నితిన్ 'రాబిన్ హుడ్' చిత్రంలో చేసిన ప్రత్యేక గీతం (ఐటమ్ సాంగ్) కూడా ఆమెకు కొత్త ప్రాజెక్టులను తెచ్చిపెట్టలేకపోయింది. దీంతో టాలీవుడ్‌ను పక్కనపెట్టి తమిళ చిత్రసీమ (కోలీవుడ్) వైపు దృష్టి సారించింది. హిప్ హాప్ తమిళ ఆది కథానాయకుడిగా నటిస్తున్న 'మీసాయ మురుక్కు 2' చిత్రం ద్వారా కోలీవుడ్‌లోకి అడుగుపెడుతోంది. సెప్టెంబర్ 25న విడుదల కానున్న ఈ సినిమాతోనైనా తమిళ తంబీలను ఆకట్టుకుని మళ్లీ బిజీ హీరోయిన్‌గా మారుతుందో లేదో వేచి చూడాలి.





# ఆనంద్‌తో ప్రేమా?.. అలాంటిదేమీ లేదు!

## పెళ్లి రూమర్లకు వైష్ణవి చైతన్య చెక్

**హైదరాబాద్, సెప్టెంబర్** ఇండస్ట్రీలో హీరో హీరోయిన్లు కలిసి ఒకటి రెండు సినిమాలు చేశారంటే చాలు.. వారి మధ్య ఏదో నడుస్తోందంటూ గుసగుసలు మొదలవడం సర్వసాధారణం. డేటింగ్, లవ్‌లో ఉన్నారంటూ పుట్టుకొచ్చే రూమర్లు కొన్నాళ్లపాటు నెట్టింట తెగ హల్‌చల్ చేస్తుంటాయి. తాజాగా ఎన్టీవీ ఇంటర్వ్యూలో పాల్గొన్న హీరోయిన్ వైష్ణవి చైతన్య.. తన కో-స్టార్ ఆనంద్ దేవరకొండతో రిలేషన్‌షిప్‌పై వస్తున్న వార్తలకు, పెళ్లి రూమర్లకు ఒక్కసారిగా ఫుల్‌స్టాప్ పెట్టారు. ఆనంద్ దేవరకొండతో ప్రేమాయణం నడుపుతున్నారంటూ వస్తున్న వార్తలపై ఈ ఇంటర్వ్యూలో యాంకర్ ప్రశ్నించగా వైష్ణవి నిర్మొహమాటంగా స్పందించారు. "మా ఇద్దరి మధ్య ఎలాంటి రిలేషన్‌షిప్ లేదు. మేమిద్దరం కేవలం కో-స్టార్స్, మంచి ఫ్రెండ్స్ మాత్రమే. మా మధ్య దాదాపు కొన్నేళ్లుగా మంచి ట్రావెల్ ఉంది. బయట వస్తున్న వార్తల్లో ఎలాంటి వాస్తవం లేదు" అని కుండబద్దలు కొట్టారు. అంతేకాకుండా, ఆనంద్ రెండు - మూడేళ్లలో పెళ్లి చేసుకునే ఆలోచనలో ఉన్నాడని, తన పెళ్లికి ఇంకా చాలా టైం ఉందని చెబుతూ, తమ బంధంపై వస్తున్న ఊహాగానాలను పూర్తిగా కొట్టిపారేశారు. జీవితంలో ఎదురయ్యే సంక్లిష్ట పరిస్థితులను ఎలా దాటాలనే అంశంపై ఆమె స్పందిస్తూ.. "ఎలాంటి గడ్డు పరిస్థితి వచ్చినా దాన్ని అంగీకరించడం, ఓర్పు వహించడం, ఆశతో ముందడుగు వేయడం చాలా ముఖ్యం. మనల్ని మనం నమ్ముకుంటూ ప్రశాంతంగా ఉంటే ఎలాంటి ఇబ్బందికర పరిస్థితులనైనా అధిగమించవచ్చు" అన్నారు. తన అందం, లైఫ్ స్టైల్ గురించి మాట్లాడుతూ.. వర్కవుట్లు అంటే తనకు ఎంతో ఇష్టమని, అయితే ఫుడ్ విషయంలో పెద్దగా కఠినంగా ఉండనని అన్నారు. చికెన్, ఎగ్స్‌తో పాటు స్వీట్స్ కూడా ఇష్టంగా తింటానని, తనకు నచ్చిన ఫుడ్ తింటూనే వర్కవుట్స్‌తో ఫిట్‌నెస్‌ను కాపాడుకుంటానని చెప్పుకొచ్చారు. విభిన్న పాత్రలతో ప్రేక్షకులను అలరిస్తూ ముందుకు సాగుతున్న ఈ భామ, పెళ్లి రూమర్లను సున్నితంగా కొట్టిపారేసిన విధానం ఇప్పుడు నెటిజన్లను, సినీ ప్రియులను అమితంగా ఆకట్టుకుంటోంది.



# ఎన్నాళ్లకెన్నాళ్లకు..

## శ్రియా శరణ్ సినిమా రిలీజ్‌కు రెడీ!

తెలుగుతో పాటు పాన్ ఇండియా స్థాయిలో విశేష ఆదరణ పొందిన కథానాయిక శ్రియా శరణ్ నటించిన తమిళ చిత్రం 'సండకారి' ఎట్టకేలకు థియేటర్లలో విడుదలకు సిద్ధమైంది. తమిళ నటుడు వేమల్, శ్రియా కాంబినేషన్‌లో రొమాంటిక్ కామెడీ కథాంశంతో తెరకెక్కిన ఈ చిత్రానికి ఆర్. మధేష్ దర్శకత్వం వహించారు. బాస్ ప్రొడక్షన్ కార్పొరేషన్ బ్యానర్‌పై 2019లోనే ఈ చిత్రాన్ని నిర్మించగా, పలు సాంకేతిక కారణాల వల్ల విడుదల వాయిదా పడుతూ వచ్చింది. చిత్రసీమలో అరుదైన రీతిలో, ఈ సినిమా థియేటర్లలో విడుదల కాకుండానే 2020 సంవత్సరానికి గాను 'తమిళనాడు స్టేట్ ఫిల్మ్ అవార్డ్స్'లో మూడు ప్రధాన పురస్కారాలను గెలుచుకుని సంచలనం సృష్టించింది. ఉత్తమ చిత్రం కేటగిరీలో మూడో బహుమతితో పాటు బెస్ట్ మేల్ ప్లేబ్యాక్ సింగర్ (అభ్రిష్), బెస్ట్ ఆర్ట్ డైరెక్టర్ (అయ్యప్పన్) అవార్డులను కైవసం చేసుకుంది. 2012లో మలయాళంలో ఘనవిజయం సాధించిన 'మై బాస్' చిత్రానికి అధికారిక రీమేక్‌గా వచ్చిన ఈ చిత్రాన్ని సెప్టెంబర్ 18న గ్రాండ్‌గా విడుదల చేస్తున్నట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. ఈ చిత్రంలో ప్రభు, దేవ్ గిల్, సత్యన్, రేఖ ఇతర ముఖ్యపాత్రల్లో నటించారు.









Printed, Published & Owned by JERIPOTHULA SAMPATH, Printed at SRI BALAJI, H.No. 4-4-85, Tilak road, District Karimnagar. 505 001 (T.S)Published at H.No. 3-6-307, Subhash Nagar, Karimnagar MDI: District, Karimnagar -505 001 (T.S) Editor: JERIPOTHULA SAMPATH, RNI NO. APTEL/2012/53127 CELL:9912758107, telanganavanil@gmail.com